



చలసాని ఆంజనేయులు
చైర్మన్, కృష్ణామిల్క్ యూనియన్

కృష్ణా మిల్క్ యూనియన్‌లో...

చలసాని 'విజయ' ముద్ర

- విజయాల పరంపరతో సరికొత్త ఒరవడి
- యూనియన్ విస్తరణ..పాల ఉత్పత్తి పెంపు చర్యలు
- పాడిరైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు
- చంద్రబాబు స్ఫూర్తిగా .. గోకులాల ఏర్పాటు
- లక్షా యాభై వేల పాడిరైతుల కుటుంబాలకు మేలు



ఉత్తమ స్వచ్ఛ భారీ పరిశ్రమల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన కామధేను ప్లాంట్.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

బాధ్యత కలిగిన కార్యకర్తకు వ్యవస్థని అప్పగిస్తే ఏ విధంగా ఉంటుందో 'కృష్ణా మిల్క్‌యూనియన్'ను చూస్తే అర్థమౌతుంది. చలసాని ఆంజనేయులు.. పరిచయం అక్కరలేని పేరు. ఎన్టీఆర్ ఆశయాలకు ఆకర్షితుడై.. టీడీపీ కార్యకర్తగా .. తెలుగురైతు అధ్యక్షుడిగా ఆయన చేసిన ప్రయాణాన్ని దగ్గరగా గమనించిన చంద్రబాబు 2019లో ఎన్నికలకు ముందు చలసాని ఆంజనేయులును విజయా డెయిరీ చైర్మన్‌గా నియమించారు. అధినేత చంద్రబాబు అప్పగించిన బాధ్యతలను ఆరేళ్ళలో ఎంతో సమర్ధవంతంగా నిర్వహించి 'విజయా డెయిరీ'ని రోల్ మోడల్‌గా నిలిపారు.

పాల ఉత్పత్తి పెంపు, పాల సేకరణ పెంపులతో మొదలై పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు.. డెయిరీ విస్తరణ కార్యకలాపాలతో ఆల్‌టైమ్ రికార్డు టర్నోవర్‌ను సాధించి చిరస్మరణీయ 'విజయా'లను అందించారు. 2003లో నిర్వహించిన తిరుపతి మహానాడులో ఉత్తమ సమన్వయ కర్తగా అధినేత చంద్రబాబు చేతుల మీదుగా తొలి అవార్డును సాధిం చిన చలసాని.. రాష్ట్రంలోని భారీ పరిశ్రమల కేటగిరీలో 'విజయా డెయిరీ'కి సాధించిన స్వచ్ఛ పరిశ్రమ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు 'విజయ' ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

దార్శనికత ఉంటే ఏ రంగంలోనైనా 'విజయ'ం తోడౌతుంది. శక్తివంతమైన నాయకత్వం విజయాలను అందిస్తుంది. కృష్ణా మిల్క్ యూనియన్ విజయం వెనుక ఓ దార్శనికుడు ఉన్నారు. ఆయనే.. చలసాని ఆంజనేయులు.. పరిచయం అక్కరలేని పేరు. రైతునాయకుడిగా.. సమైఖ్యాంధ్ర పోరాటంలో రైతుపోరాటం జరిపిన వ్యక్తిగా చిరపరిచితులే ! కృష్ణామిల్క్ యూనియన్ విజయా డెయిరీ చైర్మన్‌గా చలసాని ఎన్నికైన తర్వాత 'విజయా'ల పరంపర కొనసాగుతోంది. దేశంలో మిల్క్ యూనియన్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో .. పోటీని తట్టుకోవటమే పెను సవాల్‌గా మారిన పరిస్తితులలో డెయిరీ అభివృద్ధికి బాటలు పరచటంతో పాటు, ఫ్యాక్టరీలను విస్తరించటం, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలతో విజయ పరంపరను కొనసాగించటం చలసానికే చెల్లింది. ఆయన కృషికి నిదర్శనంగా స్వచ్ఛ డెయిరీగా నిలిచింది.

యూనియన్ విస్తరణకు శ్రీకారం

విజయా డెయిరీ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు అందుకున్న వెంటనే యూనియన్ విస్తరణ కార్యకలాపాలపై దృష్టి సారించారు. డెయిరీ అభివృద్ధి కోసం వినూత్న నిర్ణయాలు తీసుకున్నారు. పాల సేకరణ పెంపుదల లక్ష్యంగా పనిచేశారు. పల్లెకు పోదాం..పాడిని చూద్దాం.. పేరుతో యూనియన్ విస్తరణకు కృషి జరిపారు. ఫలితంగా ఈ రోజున వెయ్యికి పైగా పాల సొసైటీలు ఏర్పడ్డాయి. యూనియన్ విస్తరణ తర్వాత ఈ కార్యక్రమాన్ని 'పల్లెకు పోదాం.. పాడి రైతుకు లాభాలను పెంచుదాం' పేరుతో మరింత విస్తరించారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు, అధికారులు పల్లెలకు వెళ్ళి పాడి రైతులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని యూనియన్‌ను ఏవిధంగా ముందుకు తీసుకు వెళ్ళాలో అన్నీ చేశారు.

ప్రాజెక్టు కామధేనుతో సరికొత్త చరిత్ర

మిల్క్ యూనియన్ భారీ విస్తరణ ప్రణాళికలలో భాగంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు ఏకంగా కొత్త ప్లాంట్‌ను స్థాపించాలన్న సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆలోచన రాగానే కృష్ణా జిల్లా వీరవల్లి గ్రామంలో 22 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిలో అత్యాధునిక అల్ట్రా మోడ్రన్ మిల్క్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను నిర్మింపచేశారు. డిసెంబరు 7, 2023లో ఈ సరికొత్త ప్లాంట్ ప్రారంభమైంది. రూ.160 కోట్ల వ్యయంతో దీనిని పూర్తి చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాల నిర్వహణ సామర్ధ్యంతో 6 లక్షల లీటర్ల వరకు విస్తరించగలిగేలా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ప్లాంట్ పూర్తిగా ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. కంప్యూటర్ ఆధారిత సాంకేతికతతో పనిచేస్తుంది. ఈ ప్లాంట్ వల్ల కాలుష్యం అనేది ఉండదు. మిల్క్ యూనియన్‌కు ప్రాసెసింగ్ ఖర్చులు, యుటిలిటీ ఖర్చులు అనేకం గణనీయంగా తగ్గాయి.

పాడి రైతుల సంక్షేమం దిశగా..

పాడి రైతుల సంక్షేమ కార్యక్రమాలతో యూనియన్‌ను మరింతగా బలోపేతం చేయవచ్చని భావించిన చైర్మన్ చలసాని ఆంజనేయులు 'క్షీరబంధు' కు శ్రీకారం చుట్టారు. పాడి రైతు ఏకారణం చేతనైనా మరణిస్తే అతని కుటుంబానికి రూ. 50 వేల పరిహారం ఇస్తారు. ఇప్పటి వరకు 5 వేల కుటుంబాలకు 'క్షీరబంధు' కింద పరిహారం ఇచ్చారు. ఆ తర్వాత 'కళ్యాణమస్తు' తీసుకు వచ్చారు. పాడి రైతుల కుటుంబంలో వివాహం జరిగితే మంగళసూత్రం కోసం రూ. 20 వేల విలువైన బంగారు నాణాన్ని ఇస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 7 వేల బంగారు నాణాలు ఇచ్చారు. పాడి రైతుల కుటుంబాలలో ప్రతిభావంతమైన పిల్లల ఉన్నతవిద్య కోసం 'ప్రతిభ' పథకం తీసుకు రావటం జరిగింది. పాల ఉత్పత్తిదారుల కుటుంబాలకు విజయ హెల్త్‌కార్డులు' వంటివి ప్రవేశపెట్టడం జరిగింది. ఉద్యోగులకు సమగ్ర ఆరోగ్యబీమా పథకం మల్లోకి తెచ్చారు. తానా సహాయంతో చిల్లింగ్ సెంటర్లలో ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహించారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఎంఓయూ చేసుకుని పాడి రైతుల సమగ్ర ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టారు.

కృష్ణా జిల్లా వీరవల్లిలో ప్రాజెక్టు కామధేనుగా రూ.160 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన అల్ట్రా మోడ్రన్ మిల్క్‌ప్రాసెసింగ్ ప్లాంట్







పాలదిగుబడికి ప్రత్యేక కార్యక్రమాలు

పాల దిగుబడి పెంచటానికి అధిక పాల దిగుబడినిచ్చే పశుజాతుల దిగుమతి చేపట్టారు. వీటి కోసం సబ్సిడీలు ఇవ్వటం, వాటికి కూడా బీమా కల్పించటం, 24 గంటలూ పశువుల సంరక్షణ, పశువైద్య సేవలు అందించటం ద్వారా పశువుల జాతిని కూడా అభివృద్ధి చేశారు. 10 పశుసంరక్షణ అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేశారు. చాఫ్ కట్టర్లు, బ్రష్ కట్టర్లు, పాలు



పితికే యంత్రాలను సబ్సిడీ ప్రాతిపదికన అందిస్తున్నారు.

చంద్రబాబు స్ఫూర్తిగా .. గోకులాల ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రేరణతో పాల విస్తరణ, పాల ఉత్పత్తి నిర్వహణ ఖర్చులను తగ్గించటానికి మెరుగైన పశుగ్రాసాన్ని పండించటానికి యూనియన్ నుంచి ఇటీవలే గోకులాలకు శ్రీకారం చుట్టారు. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'భారత్ పశుధన్' కింద లింగ నిర్ధారిత వీర్యాన్ని సబ్సిడీ రూ.100 భరించి ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో వీర్యం డోస్‌ను రూ. 50 లకే అందిస్తోంది.

పాల సేకరణ ధర పెంపు

చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించటానికి ముందు ఆరు సంవత్సరాలుగా పాలసేకరణ ధరలు స్తబ్దుగా ఉన్నాయి. పాడి రైతు తన ఉత్పత్తులకు లాభదాయకమైన ధరను పొందాలన్న ఉద్దేశ్యంతో గత ఆరేళ్లుగా ధరలను పెంచింది. లీటరుకు సమారుగా రూ. 15.40 లను పెంచింది. దేశంలోనే గేదెపాలకు అత్యుత్తమ ధరను విజయా డెయిరీ అందిస్తోంది.

భారీగా రిజర్వులు

గత ఐదేళ్ళుగా డెయిరీని విజయ పథంలోకి తీసుకురావటంతో.. లాభాలు కూడా గణనీయంగా పెరిగాయి. కృష్ణా మిల్క్ యూనియన్ సుస్థిరమైన ఆర్థిక ఫలితాలను చవిచూస్తోంది. 2019 - 20 లో రూ. 104.52 కోట్ల రిజర్వులను సాధించగా.. 2020 - 21 లో రూ.122.13 కోట్లు, 2021- 22లో రూ.148.60 కోట్లు, 2022-23 లో రూ.175.40 కోట్లు, 2023-24 లో రూ.205.65 కోట్లు, 2024- 25 లో రూ. 228.58 కోట్ల రిజర్వులను సాధించింది.

చలసాని హయాంలో వృద్ధిలో పైపైకి..

2018 - 19 నుంచి 2019 - 20 వరకు విజయా డెయిరీ వార్షిక టర్నోవర్ రికార్డు స్థాయిలో 12 శాతం పెరిగింది. 2020 - 21 సంవత్సరంలో 15 శాతం వృద్ధి పెరిగింది. 2021- 22 లో 10 శాతం వృద్ధి పెరిగింది. కోవిడ్ - 19 మహమ్మారి వచ్చినపుడు దేశవ్యాప్తంగా అమ్మకాల తగ్గుదల ఉన్నప్పటికీ చైర్మన్ చలసాని ఆంజనేయులు మంచి నాయకత్వ స్ఫూర్తి కారణంగా గణనీయమైన వృద్ధిని నమోదు చేయటం విశేషం. ఇదే సందర్భంలో పొరుగు జిల్లాలైన గుంటూరు, ప్రకాశం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి , ఖమ్మం జిల్లాలలో కూడా విజయా డెయిరీ విస్తరించింది. ఈ కారణంగా 2022 - 23 వ సంవత్సరంలో కృష్ణామిల్క్ యూనియన్ రూ.1104 కోట్లకు పైగా టర్నోవర్‌ను నమోదు చేసింది. ఇక ఇక్కడ నుంచి మరింత దూసుకుపోయింది. 2023- 24లో రూ.1200 కోట్లు, 2024-25లో రూ.1211 కోట్ల టర్నోవర్ సాధించింది. బుడమేరుకు వరదలు వచ్చినా 42 రోజుల పాటు చిట్టినగర్‌లోని మిల్క్‌ఫ్యాక్టరీని మూసివేయాల్సి వచ్చినా కూడా వృద్ధి సాధించటం విశేషం.

విప్లవాత్మక స్థాయిలో విజయా డెయిరీ విస్తరణ

చలసాని ఆంజనేయులు నేతృత్వంలో విజయా డెయిరీ వార్షిక టర్నోవర్ 74 శాతం పెరిగింది. కృష్ణామిల్క్ యూనియన్‌ను ముందుకు తీసుకువెళ్ళాలన్న ఉద్దేశ్యంతో ఆయన ఒక ప్రణాళికాబద్ధమైన విధానాన్ని ఎంచుకున్నారు. డెయిరీని విస్తరించాలంటే.. గేదెల కొనుగోలును ప్రోత్సహించాలని, పాల ఉత్పత్తిని పెంచాలని, పాల సేకరణను పెంచాలని, పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయటం వంటి చర్యలతో పాలసేకరణను విప్లవాత్మక స్థాయిలో ముందుకు తీసుకువెళ్ళారు. క్షేత్ర స్థాయిలో తాను అనుకున్న లక్ష్యాలను సాధించటంతో సొసైటీలను మరిన్ని గ్రామాలకు విస్తరించటంతో పాటు డెయిరీ విస్తరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టు కామధేను పేరుతో వీరవల్లిలో సరికొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కిందటి బుడమేరు వరదలకు విజయవాడ చిట్టినగర్‌లోని ప్రధాన ప్లాంట్ మునిగిపోతే వీరవల్లి ప్లాంట్ ద్వారా ఉత్పాదకత జరిగింది. దీంతో బుడమేరు వరదలలో ఎన్నో రంగాలు, వ్యవస్థలు పనిచేయకపోయినా కూడా పాల ఉత్పత్తి జరిగింది. చలసాని ఆంజనేయులు దూరాలోచన ఎంతో మేలు చేసింది.



సమైఖ్యాంధ్ర ఉద్యమ స్ఫూర్తితో లక్ష మంది రైతులతో చలసాని ఆంజనేయులు జంక్షన్‌లో గర్జన నిర్వహించారు. ఉద్యోగుల ఉద్యమంగా విమర్శలు చేసిన నాటి తెలంగాణా విమర్శకుల నోళ్ళను మూయించారు. లక్షకు పైగా రైతులతో నిర్వహించిన సమైఖ్యాంధ్ర గర్జన సభ దిగ్విజయమైంది. విమర్శకుల నోళ్ళు మూయించింది. రైతు గర్జనలో ఏపీఎన్‌జీఓ జేఏసీ నేత పీ అశోక్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చలసాని ఆంజనేయులు స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఆ తర్వాత సమైక్యాంధ్ర ఉద్యమంలో రైతులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు.



ఉత్తమ సమన్వయకర్తగా నాటి సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న చలసాని ఆంజనేయులు

రూ.400 కోట్ల బోనస్ పంపిణీ

దేశంలోనే రైతులకు ప్రతి నాలుగు నెలలకు బోనస్‌ను ముందుగా అందించటం విజయా డెయిరీ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. రాబోయే కాలానికి వ్యాపారాన్ని ముందుగా అంచనా వేసి పాడి రైతులకు బోనస్ అందించటమనేది ఒక్క 'విజయా డెయిరీ' కే సాధ్యమైంది. దేశంలోనే అత్యధికంగా 10 శాతం బోనస్ ఇచ్చేది కూడా విజయా కావటం గమనార్హం. చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించాక రూ.400 కోట్ల మేర పాడి రైతులకు బోనస్‌లను ఇవ్వటం విశేషం.

పెనమలూరు

● పెనమలూరు ● గన్నవరం

భక్తిశ్రద్ధలతో షిర్డీ సాయిబాబా సమాధి ఉత్సవం



ఉయ్యూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గండిగుంటలో షిర్డీసాయిబాబా సమాధి ఉత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బైపాస్ రోడ్డులో అయ్యప్పస్వామి దేవస్థాన ఆవరణలో షిర్డీసాయిబాబా మందిరంలో బాబా విగ్రహానికి పంచామృత అభిషేకం, సమాధి అలంకరణ నేత్రపర్వంగా చేశారు. మామిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు ఉపాధ్యాయ బాల్ల, జయదేవ్ తదితరులు పాల్గొని సేవలందించారు. గండిగుంట, ఉయ్యూరు, చినఓగిరాల పరిసర ప్రాంతాలనుంచి భక్తులు హాజరయ్యారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ నైతు ధర రూ. 530

శ్రీనివాస్‌కు ఘననివాళి

గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఎం కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీరవల్లి నెక్కలపు శ్రీనివాస్ సంస్మరణ సభ సూరగాని సాంబశివరావు అధ్యక్షతన గురువారం జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చింతపల్లి పాపా రావు జయనికి చిరునామాగా చేసుకుని శ్రీనివాస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశారన్నారు. ఎంపీపీ అనగాని రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి వైనరసింహారావు, కొండా వీరాస్వామి, బుద్ధవరం సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వంద కోట్లతో అభివృద్ధి పనులు

» ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు నియోజకవర్గంలోని రెండు మునిసిపాలిటీలు, మూడు మండలాల్లో మొత్తం వంద కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. వాటిలో కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని పనులు ప్రారంభ దశలో ఉన్నాయని అన్నారు. గురువారం తాడిగడప మునిసిపాలిటీ పోరంకి కృష్ణవేణి పాఠశాల వద్ద రూ.23.5లక్షల నిధులతో సిమెంటు రోడ్డు, డ్రెయినేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 15నెలల కాలంలోనే అభివృద్ధి పనులలో పరుగులు పెడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్, టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, తాతపూడి గణేష్, సంగెపు రంగారావు, మహిళా నేతలు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

సూపర్ జీఎస్టీపై పోరంకి క్యాపిటల్ ఆసుపత్రిలో జరిగిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల పేద ప్రజలకు మందులు, వైద్య సదుపాయాలు మరింత అందుబాటులో ఉంటాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు, సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, వాణిజ్యపన్నుల శాఖ అదనపు కమిషనర్ బాలాజీరావు, జాయింట్ కమిషనర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆశాజ్యోతి ఆశ్రమంలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమాన్‌జంక్షన్ లయన్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ సభ్యుడు కొండవనేని రవీంద్ర తన తండ్రి కృష్ణమూర్తి జన్మదినం పురస్కరించుకొని గురువారం ఆశాజ్యోతి ఆశ్రమంలో దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌చక్రవర్తి పంచకర్ల, లయన్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణలు పెంచాలి

» కేవీఐసీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గ్రీఫ్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అతిథులు

కానూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఖాదీ ఉత్పత్తులు, మేక్ ఇన్ ఇండియా ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణలు మరింతగా పెంచాలని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్(కేవీఐసీ) రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గ్రీఫ్ చెప్పారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో కేవీఐసీ సహకారంతో వ్యవస్థాపక అభివృద్ధి ప్రజల విద్యా కార్యక్రమం అనే అంశంపై గురువారం జరిగిన సెమినార్‌లో డాక్టర్ గ్రీఫ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవస్థాపక అభివృద్ధి, వర్తమాన వ్యవస్థాపకులకు మద్దతు అవ్వడానికి అందుబాటులో ఉన్న కేవీఐసీ పథకాలను ఆయన వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్. వెంకట్రావు, ఏపీ కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ. ఆనంద్, విజయవాడలోని కేవీఐసీ ఏడీ ఆర్‌ఎల్ఎన్ మూర్తి, సిద్ధార్థ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వరరావు, ప్రొ. వీసీ ఏపీ రత్నప్రసాద్, డాక్టర్ పాండురంగారావు, డాక్టర్ వి. మల్లికార్జున తదితరులు పాల్గొని ప్రసంగించారు. కాగా ఖాదీ స్వదేశీ ఉత్పత్తులనే మాత్రమే ఉపయోగిస్తామని అతిథులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ ఎన్. మాలతి తదితరులు పాల్గొన్నారు.

యార్లగడ్డ కార్యాలయానికి వసంత నాగేశ్వరరావు



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును పలుకరిస్తున్న మాజీ హోం మంత్రి వసంత

ప్రసాదంపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు క్యాంపు కార్యాలయాన్ని మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు గురువారం సందర్శించారు. ఇరువురు నాయకులు రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. గన్నవరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా వసంత నాగేశ్వరరావు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా రామరాజు



సాయిరామరాజు

ప్రసాదంపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా కల్లేపల్లి సాయి రామరాజును నియమిస్తూ ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లాడి రుద్రయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపు గోపురం నినాదంతో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలో ఉన్న పలు ఆలయాలలో ఆధునీకరణ నిర్మాణాలకు పూర్తి బాధ్యతలు నిర్వహించాలని పేర్కొన్నారు. ధర్మరక్షణ, గోసేవ, గుడి సేవ బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు.



రైతులకు ఎలుకల నివారణ మందులు పంపిణీ చేస్తున్న కలకోటి శ్రీనివాసరెడ్డి, గంపా శ్రీనివాస్

ఖరీఫ్‌లో ఎలుకల నిర్మూలనపై అవగాహన

విజయవాడ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంట దిగుబడికి నష్టం కలగకుండా ఎలుకల నిర్మూలనపై నున్న గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నున్న వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ గంపా శ్రీనివాస్, గ్రామ వీఏఏ విజయలక్ష్మి, వీహెచ్ఏ సైదా తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రోగులకు ఉపశమనం



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలం లోని వైద్య ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో గురువారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా బాపులపాడు పీహెచ్‌సీలో కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య రంగంలో జీఎస్టీ తగ్గించడం వలన మందులు, వైద్య పరికరాల ధరల భారం గణనీయంగా తగ్గి రోగులకు లాభ దాయకంగా మారిందని పీహెచ్‌సీ పీహెచ్‌ఓ పణికుమార్ రోగులకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్‌ల్లో నిబంధనలు పాటించాలి

» తహసీల్దార్ శివయ్య ఆదేశం



క్రాకర్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివయ్య

గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయదారులు నిబంధనలను పాటించాలని తహసీల్దార్ కేవీ శివయ్య ఆదేశించారు. మండలంలోని పురుషోత్తపట్నం, బీబీగూడెం గ్రామాల్లో ఉన్న బాణసంచా గోడౌన్‌లను ఫైర్, పోలీస్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్స్‌ప్లోజివ్ శాఖ నిర్దేశించిన ప్రమాణాలు నిర్వహించాలన్నారు. గోడౌన్‌లలో పని చేస్తున్న వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. అత్యవసర నిల్వలు చేయవద్దని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కాలం చెల్లిన బాణసంచా విక్రయించవద్దని చెప్పారు. అగ్నిమాపక అధికారి షేక్ జాన్ అహ్మద్, ఎస్సై పికెషోర్ తదితరులు పాల్గొన్నారు.

● ఉయ్యూరు: మందుగుండు సామగ్రి విక్రయాలపై అప్రమత్తత అవసరమని, మందుగుండు సామగ్రి దుకాణాలవద్ద జాగ్రత్తలు పాటించేలా చూడాలని తహసీల్దార్ ఎం. సురేశ్‌కుమార్ అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అధికారులు, మందుసామగ్రి విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. దుకాణం ఏర్పాటు చేయదలచిన వారు పరిశీలకులు ముందుగానే పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక శాఖల ద్వారా అవసరమైన అనుమతి పత్రాలు తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో అర్జీదారులు చేసేలా చూడాలన్నారు. ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నీచ రాజకీయాలు మానుకోవాలి

» టీడీపీ బాపులపాడు మండల నేతలు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ఆ నెపం టీడీపీ నేతలపై మోపడానికి ప్రయత్నించిన వైసీపీ తన నీచ రాజకీయాలను అధికారం పోయినా మానలేదని టీడీపీ బాపులపాడు మండల నేతలు వైసీపీ చర్యలను ఖండించారు. చిత్తూరు జిల్లా దేవళంపేటలో మాజీ సర్పంచ్ గోవిందయ్య అంబేద్కర్ విగ్రహానికి కుట్ర పూరితంగా నిప్పు పెట్టిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ గురువారం టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహంతో పాటు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దయాల రాజేశ్వరరావు, ఎస్‌సీఎల్పీ వీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, రైతు నాయకుడు గుండవనేని ఉమావరప్రసాద్, మండవ రవీంద్ర అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ధ్వంసం చేయడానికి కుట్ర పన్నిన వారిని పూర్తి స్థాయిలో విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాకులపాడు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, టీడీపీ మండల కార్యదర్శి పుట్టా సురేష్, జంక్షన్ పట్టణ అధ్యక్షుడు ఆట్లూరి శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ గార్లపాటి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మించారు

» గుంతలు పూడ్చటం మరిచారు



సీసీ డ్రెయిన్ నిర్మాణం చేసి పూడ్చకపోవడంతో క్షేత్ర ముందు ఏర్పడ్డ గుంతలు

ఉయ్యూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక 9వ వార్డు వీరమ్మతల్లి ఇంటి రోడ్డులో సీసీ డ్రెయిన్ పక్క గుంతలు పూడ్చకపోవడంతో స్థానికులు, అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఆసౌకర్యానికి గురవుతున్నారు. అమ్మవారి ఇంటి రోడ్డులో ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం నిమిత్తం గుంతలు తవ్వి మట్టిని వేరే చోటికి తరలించారు. ఇరువైపులా డ్రెయిన్ నిర్మాణం పూర్తిచేసి మూడు వారాలకు పైగా కావస్తున్నా డ్రెయిన్‌పక్కన ఉన్న గుంతలు పూడ్చకపోవడంతో పిల్లలు, వృద్ధులు పడి గాయపడుతున్నారు. డ్రెయిన్‌కు రోడ్డుకు మధ్య ఉన్న ఖాళీని మెటల్ చిప్స్‌తో పూడ్చవలసి ఉండగా కాంట్రాక్టరు ఇప్పటి వరకు పూర్తిచేయలేదు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు, వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డులో గుంతల వల్ల వాహనాలను తప్పుకునేందుకు వీలులేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చేలా కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళల సమస్యలపై దేశ వ్యాప్త పోరాటం

» ఐద్వా మండలాధ్యక్షురాలు షేక్ వలీజ్

పెనమలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నేడు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఐద్వా సంఘం దేశవ్యాప్తంగా పోరాటం చేస్తుందని ఐద్వా సంఘ మండలాధ్యక్షురాలు షేక్ వలీజ్ అన్నారు. యనమలకుదురులో మహిళాసంఘ ఆవిర్భావ దినం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల పని గంటలను పెంచి వారిని రాత్రి పూట కూడా పని చేయించడం దారుణమని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో మహిళా హక్కుల కోసం మరింత ఉద్యతంగా పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హసీన్, బీ, వాణి, శ్రీదేవి, బీజాన్‌బీ, నూర్జహాన్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నసమారాధన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దంటగుంటలో గురువారం అయ్యప్ప దీక్షాధారులకు అన్నసమారాధన సందర్భంగా ప్రత్యేక పూజ నిర్వహించారు. గత 8సంవత్సరాలుగా అయ్యప్పలకు 41రోజుల పాటు(తదియారాధన) నిర్వహిస్తున్నామని, దాతలు సహకరించడం అభినందనీయమని సామవేదం శ్రీనివాసశర్మ దంపతులు తెలిపారు. కానుమోలు, రంగయ్యప్పారావుపేట, ఒగిరాల, కావలపాడు, వైకుంఠపుర్యం తదితర గ్రామాలకు చెందిన అయ్యప్ప దీక్షాధారులకు నిత్యం భిక్ష(అన్న సమారాధన) నిర్వహిస్తున్నామని వివరించారు.

అంతర్గత రహదారులే డ్రెయినేజీలా..

● చిన్నపాటి వర్షాలకే బండారుగూడెంలో పరిస్థితి



బండారుగూడెంలో జలమయమైన అంతర్గత రహదారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షం పడినా డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో బండారుగూడెంలోని అంతర్గత రహదారులన్నీ చిన్నపాటి కాలువల్లా మారిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బండారుగూడెంలో డ్రెయినేజీ సమస్య చాలా కాలం నుంచి వేధిస్తోందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కేవలం మాత్రం పూడికతీసి వదిలేస్తున్నారని సీపీఎం నాయకుడు బద్రి బెనెర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షానికే మురుగునీటితో కలిసి వర్షపునీరు రహదారులను ముంచెత్తడంతో ఆ మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్ళాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమల బెడద ఎక్కువై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తక్షణం స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని బండారు గూడెం ప్రజలు కోరుతున్నారు.



షాట్‌పుట్ విసురుతున్న విద్యార్థి

ముగిసిన మండల ఎస్‌జీఎఫ్ క్రీడలు

గన్నవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న మండల ఎస్‌జీఎఫ్ క్రీడలు గురువారం అథ్లెటిక్ పోటీలతో ఉత్సాహంగా ముగిశాయి. పలు పాఠశాలల నుంచి 400 మంది అండర్-14, 17 బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నట్టు మండల క్రీడా సమన్వయకర్త దనియాల నాగరాజు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి గుడివాడలో జరగనున్న డివిజనల్ స్థాయి పోటీలకు మండల జట్టు తరుపున పంపుతున్నట్టు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ మీరాసాహెబ్, సీహెచ్ బాలకృష్ణ, చంద్రశేఖర్, కెగిత, టాన్య గిరి, విజయకుమారి, కాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి దందా!

ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీలో భారీగా చేతులు మారిన నగదు

- బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలో ఐదు పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి
- ఇదే అదనుగా తెరవెనుక చక్రం తిప్పిన కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారులు
- ఒక్కో పోస్టుకు రూ.10 లక్షల చొప్పున వసూలు!
- ఎంట్రన్స్ టెస్టు కూడా వేరే వ్యక్తులతో రాయించారనే ప్రచారం!
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా విద్యాశాఖ వ్యవహారం



విద్యాశాఖలో అవినీతి దందా తారాస్థాయికి చేరింది. విజయవాడలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలో ఐదు టీచర్ పోస్టుల భర్తీలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారింది. ఒక్కో పోస్టుకు రూ.10 లక్షలు డిమాండ్ చేసి మరీ కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారులు వసూలు చేసినట్టు సమాచారం. ఎంట్రన్స్ టెస్టు కూడా అభ్యర్థులకు బదులు వేరే వారితో రాయించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారం ఓ కీలక అధికారి నడిపించినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ అవినీతిపై కలెక్టరేట్‌లోని ఉన్నతాధికారుల్లో సైతం తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది.

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం/విజయవాడ : విజయవాడలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరిపి ఐదు టీచర్ పోస్టులను భర్తీ చేసుకునేందుకు అనుమతులు తెచ్చుకుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించిన విద్యాశాఖ పరిపాలనా వ్యవహారాలన్నీ కృష్ణాజిల్లా విద్యాశాఖ కార్యాలయంలోనే జరుగుతున్నాయి. దీంతో ఈ వ్యవహారాలు చూసేది తామేనని, తమ కనుసన్నల్లోనే ఈ పోస్టుల భర్తీ జరగాలని కీలక అధికారి తనదైన శైలిలో అల్టిమేటం జారీ చేసినట్టు సమాచారం. ఎన్టీఆర్‌జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించవద్దని, ఏం జరిగినా తమ కనుసన్నల్లోనే జరగాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో పాఠశాల యాజమాన్యం కృష్ణా డీఈవో కార్యాలయ అధికారులు చెప్పినట్టుగా నడచుకుంటామని ముందుకు వచ్చినట్టు సమాచారం. ఈ కీలక అధికారి తన చేతికి మట్టి అంటకుండా ఈ టీచర్ పోస్టుల భర్తీలో మొత్తం వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా నడిపేలా ఒక డీవైఈవోకు బాధ్యతలు అప్పగించి తెరవెనుక కథ నడిపించారనే ఆరోపణలు ఉన్నాయి.

అభ్యర్థులతో నామమాత్రంగా పరీక్ష రాయించి..

అజరయ్య ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఐదు టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ, పరీక్ష నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక గుట్టుచప్పుడు కాకుండా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీచర్ పోస్టు కావాలంటే ఇంత మొత్తంలో నగదు చెల్లించాలని తెర వెనుక బేరం పెట్టి, ఒక్కో పోస్టుకు లక్షలాది రూపాయలను వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. యాజమాన్యానికి మిగతా 8లో..

అంతా తానై నడిపిన కీలక అధికారి!

కృష్ణాజిల్లా విద్యాశాఖలో పనిచేసే కీలక అధికారి తీరు ఇటీవల కాలంలో వివాదాస్పదమవుతోంది. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి తనదైన శైలిలో వ్యవహారాలు నడుపుతున్న సదరు అధికారి తన అనుభవాన్నంతటినీ ఉపయోగించి టీచర్ పోస్టుల భర్తీలో పెద్ద మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడ్డారనే అంశంపై జిల్లాస్థాయి అధికారులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఇంత జరిగినా ఈ అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి కారణాలు ఏమై ఉంటాయనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

దక్షిణాఫ్రికాలోనే జనార్దన్!

- రావడానికి టికెట్ బుక్ చేసుకున్నట్టు సమాచారం
- ములకలచెరువు, భవానీపురంలో నమోదైన కేసులు
- దేశంలోని అన్ని ప్రధాన విమానాశ్రయాలకు లుక్ అవుట్ సర్క్యులర్ జారీ
- రాగానే సంకెళ్లు వేయడానికి సిద్ధంగా ఎక్సైజ్ అధికారులు



ఇబ్రహీంపట్నం కేంద్రంగా నకిలీ మద్యం డిస్టలరీని ప్రారంభించిన అద్దేపల్లి జనార్దనరావు ఇంకా దక్షిణాఫ్రికాలోనే ఉన్నాడా? సొంత గడ్డపై అడుగుపెట్టిన వెంటనే ఎక్సైజ్ పోలీసులకు చిక్కకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నాడా? విమానాశ్రయంలో దిగిన తర్వాత ఏయే మార్గాల్లో వెళ్లాలన్న దానిపై అనుచరులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. జనార్దనరావు కోసం ఎక్సైజ్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దేశంలోని అన్ని ప్రధాన విమానాశ్రయాలకు లుక్ అవుట్ సర్క్యులర్‌ను పంపారు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): జనార్దనరావు ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్నాడని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఆయన ఇక్కడికి రావడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. జనార్దనరావు ఎవరెవరితో సంప్రదింపులు చేస్తున్నాడు, ఏయే సమయాల్లో చేస్తున్నాడు అన్న వివరాలను అబ్కారీ శాఖ నిశితంగా పరిశీలిస్తోంది. త్వరలోనే విజయవాడ వచ్చి నకిలీ మద్యానికి సంబంధించిన అన్ని వివరాలను వెల్లడిస్తానని మీడియాను ఉటంకిస్తూ జనార్దనరావు సెల్ఫీ వీడియో ద్వారా సందేశాన్ని పంపిన మిగతా 8లో..

మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా దిలీప్‌కుమార్ నియామకం



మచిలీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం జీవోఆర్‌టీ నెంబరు 867ను గురువారం జారీ చేసింది. అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడిగా ఐ.దిలీప్‌కుమార్, బ్యాంక్ పాలకవర్గ సభ్యులుగా వేము కోటేశ్వరరావు, గున్నం నాగరాజన్, గెల్లి అరుణకుమారి, నూకల రమాదేవి, పోతాబత్తుల పాండురంగారావు, బొర్రా శ్రీనివాస్, సూరిశెట్టి హరికృష్ణ, వంపుగడవల చౌదరి నియమితులయ్యారు.

బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

- జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

605 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

వైసీపీ డైరెక్షన్‌లోనే అంబేద్కర్ విగ్రహ ధ్వంసం

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

చిలకలపూడిలో భారీ చోరీ

- రూ.22 లక్షల ఆభరణాల అపహరణ

సాంకేతికతతో ప్రమాదాలకు చెక్

- ఐఐటీ ఇంజనీర్లతో కలెక్టర్ బాలాజీ



8లో

ఇదేం డీపీఆర్!

- రెండేళ్లుగా సాగుతున్న ఎన్‌హెచ్ - 65 విస్తరణ డీపీఆర్
- ఎక్కడి నుంచి మొదలుపెట్టాలన్న దానిపై స్పష్టత కరువు
- ఇప్పటికే నాలుగు సార్లు మారిన నిర్ణయాలు
- బెంజిసర్కిల్ నుంచి కానూరు వరకు విస్తరణపై నిర్ణయం తీసుకోలేని స్థితి
- మెట్రోను దృష్టిలో పెట్టుకుని.. దగ్గర దగ్గరగా ఉన్న జంక్షన్లను చూస్తే..
- వెహికల్ అండర్ పాస్‌ల కంటే కూడా డబుల్ డెక్కర్ ఫ్లైఓవరే మేలు
- కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వటానికి కూడా అవకాశాలు
- మచిలీపట్నం పోర్టును దృష్టిలో పెట్టుకుని చూస్తే.. వెంటనే అనుమతి వచ్చే అవకాశం



విజయవాడ నుంచి బందరు వరకు 65వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65) ఆరు వరసల విస్తరణకు రూపొందిస్తున్న సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రెండేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారంలో ఇప్పటి నాలుగు సార్లు నిర్ణయాలు మారాయి. ఇప్పటికీ ఎక్కడ నుంచి మొదలు పెట్టాలనేదానిపై స్పష్టత రాలేదు. దీంతో అసలు ఇదేం డీపీఆర్ అంటూ జిల్లా ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడ నుంచి బందరు వరకు 65వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65) ఆరు వరసల విస్తరణకు సంబంధించి రూపొందిస్తున్న సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఎంచుకోవాల్సిన ప్రాంతాలపై ఖచ్చితత్వం లేక అపహాస్యానికి గురవుతోంది. డీపీఆర్ రూపొందిస్తున్న కన్సల్టెన్సీ సంస్థకు దీనిపై స్పష్టత లోపిస్తోంది. విజయవాడ- మచిలీపట్నం ఎన్‌హెచ్ - 65 ఆరు వరసల విస్తరణ డీపీఆర్ రూపకల్పనకు గతంలో ఒకసారి బాధ్యతలను అప్పగించినపుడు ఆటోనగర్ నుంచి మచిలీపట్నం అన్నారు. ఆ దిశగా డీపీఆర్ జరుగుతుండగానే అర్ధంతరంగా డీపీఆర్ ఆగిపోయింది. మళ్లీ ఆరు వరసల విస్తరణకు డీపీఆర్ జరుగుతోంది. బెంజిసర్కిల్ నుంచి మచిలీపట్నం వరకు విస్తరణ అన్నారు. ఆ తర్వాత ఆటోనగర్ నుంచి మచిలీపట్నం అన్నారు. ఈ రెండూ కాదని కానూరు నుంచి మచిలీపట్నం వరకు ఆరు వరసల సర్వే అన్నారు. ఇది కూడా కాదని తాజాగా మళ్లీ బెంజిసర్కిల్ నుంచి మచిలీపట్నం వరకు అంటున్నారు. దీంతో డీపీఆర్ రూపకల్పన ఎలా చేయాలన్న దానిపైనే రెండేళ్ల కాలహరణం జరిగిపోయింది. డీపీఆర్ తయారు చేసే విధానం మీదనే స్పష్టత లేకపోవటం ఆందోళనకరంగా మారింది.

బెంజిసర్కిల్ నుంచి కానూరు వరకు విస్తరించాలంటే..

విజయవాడ నుంచి బందరు వరకు ఆరు వరసలుగా విస్తరించాలంటే.. ఖచ్చితంగా బెంజిసర్కిల్ నుంచి బందరు వరకు విస్తరించాల్సి ఉంటుంది. ప్రస్తుత అవసరాలను అధ్యయనం చేయటంతో పాటుగా భవిష్యత్తు అవసరాలను కూడా అధ్యయనం చేస్తూ ఆరు వరసలుగా విస్తరించాల్సిన అవసరం ఉంది. విజయవాడలో బెంజిసర్కిల్ నుంచి కానూరు వరకు ఆరు వరసలుగా ప్రస్తుత రోడ్డును విస్తరించాలంటే ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయి. రెండు వైపులా భారీ సంఖ్యలో ఉన్న వాణిజ్య, నివాస భవనాలను కూలగొట్టి రోడ్డును విస్తరించాలంటే.. ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారుతుంది. దీనికి తోడు కోర్టు కేసులను కూడా భారీగా ఎదుర్కొనే అవకాశం ఉంది. చివరికి విస్తరణ అనేది మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని బెంజిసర్కిల్ నుంచి కానూరు వరకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది.


డబుల్ డెక్కర్ ఫ్లై ఓవరే ఎందుకు కావాలి ?

ఎందుకంటే బెంజిసర్కిల్ నుంచి చూస్తే ఎన్టీఆర్ సర్కిల్, హైస్కూల్ రోడ్డు జంక్షన్, ఆటోనగర్ రోడ్డు జంక్షన్, తాడిగడప, కానూరు, పోరంకి, గంగూరు ప్రాంతాలలో అతి పెద్ద జంక్షన్లు ఉన్నాయి. ఈ జంక్షన్ల దగ్గర ట్రాఫిక్ ఏ స్థాయిలో ఉంటుందో చెప్పనవసరం లేదు. రేపు ఇదే ప్రాంతాలలో ఆరు వరుసలుగా విస్తరించినా.. కూడా ఈ జంక్షన్ల దగ్గర సమస్యలు అలాగే ఉంటాయి. ఈ సమస్యలు లేకుండా చేయాలంటే.. దాదాపుగా ఆరేడు చోట్ల దగ్గర దగ్గరగా వెహికల్ అండర్ పాస్ (వీయూపీ)లు కట్టాల్సి ఉంటుంది. ఇంత దగ్గర దగ్గరగా వీయూపీలను కడితే రోడ్డు అప్ అండ్ డౌన్ మాదిరిగా ఉంటుంది. కొత్త సమస్యలను కూడా తెచ్చి పెట్టే అవకాశాలుంటాయని ఇంజనీరింగ్ నిపుణులు కూడా వాదనలను వినిపిస్తున్నారు. ఈ ఇబ్బందులన్నింటినీ అధిగమించాలంటే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ఒక్కటే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. పెనమలూరు సెంటర్ నుంచి వాహనాలు ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లిపోతాయి. మెట్రో రైలు ఆ పైన వెళ్లటానికి మిగతా 8లో..

మెట్రో కారిడార్‌ను దృష్టిలో పెట్టుకుని చూస్తే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు చాన్స్!

బందరు రోడ్డులో పెనమలూరు సెంటర్ నుంచి బెంజిసర్కిల్ మీదుగా పీఎన్‌బీఎస్ వరకు మెట్రో రైల్ కారిడార్ వెళుతోంది. కాబట్టి దీనిని ఖాయంగా చేసుకుని పెనమలూరు సెంటర్ నుంచి బెంజిసర్కిల్ వరకు ఎన్‌హెచ్ - 65పై డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను ప్రతిపాదించటం ద్వారా పైన చెప్పుకున్న చిక్కుముడులను సరిచేసుకునే అవకాశం ఉంది. పైగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు డబ్బులు కూడా ఇచ్చే అవకాశం ఉంది. వెంటనే అంగీకారం తెలిపే అవకాశం కూడా ఉంది. ఎందుకంటే మచిలీపట్నం పోర్టును దృష్టిలో పెట్టుకుని ఎన్‌హెచ్ - 65ను ఆరు వరసలుగా విస్తరించాలని కేంద్రం బలంగా ఉంది. కాబట్టి బెంజిసర్కిల్ నుంచి పెనమలూరు సెంటర్ వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌ను సాధించుకోవటానికి అవకాశాలు అయితే ఉన్నాయి.

కొండంత అందం



సరికొత్త హంగులతో అందుబాటులో టాయ్ ట్రైన్

సరికొత్తగా అందుబాటులోకి గాంధీహిల్

- రూ.1.30 కోట్లతో కీలకమైన అభివృద్ధి పనులు
- విజ్ఞాన విస్తరణకు ప్లానిటోరియం, గ్రంథాలయం
- ఆకట్టుకుంటున్న మహాత్ముడి జన్మస్థలం, ఆశ్రమాలు, జంతర్‌మంతర్ నమూనా
- ఒకేచోట నుంచి నగరం మొత్తం విహంగ వీక్షణ

విజయవాడ నగరం మొత్తాన్ని రెప్పపాటు కాలంలో చూసేయాలనుందా..? కృష్ణమ్మ సోయగాలు, ఇంద్రకీలాద్రి అందాలు, ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం, యనమలకుదురు, గుణదల కొండలతో పాటు వన్‌టౌన్ నుంచి టూటౌన్, తాడేపల్లి నుంచి జక్కంపూడి, నున్న వరకు ఒకేచోట చూడాలని ఉందా..? అయితే, గాంధీహిల్‌కు వచ్చేయాల్సిందే. సముద్ర మట్టానికి 550 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండపైకి చేరితే చాలు.. విజయవాడ మొత్తాన్ని ఒకేసారి చూసేయొచ్చు. గాంధీహిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ చారిత్రక శాంతి శిఖరాగ్రం అందంగా ముస్తాబు కావడంతో పాటు సరికొత్తగా అందుబాటులోకి వచ్చింది.

విజయవాడ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : దాదాపు 18 ఎకరాల్లో గాంధీకొండ విస్తరించి ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం జాతిపిత విజయవాడలో మూడుసార్లు పర్యటించారు. ఆయన గుర్తుగానే టుటౌన్‌లోని గాంధీనగర్, వన్‌టౌన్‌లోని గాంధీహిల్ ఏర్పడ్డాయి. 1964లో అప్పటి ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి ఈ స్మారక చిహ్నం ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. 1968లో పనులు పూర్తికావడంతో నాటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ దీనిని ప్రారంభించారు. ఈ హిల్ నిర్వహణ బాధ్యత 1977లో గాంధీహిల్ ఫౌండేషన్ తీసుకుంది. 2020 వరకు బాధ్యత చూసుకుంది. ఆ తరువాత ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించారు. ఐదేళ్ల పాటు వీఎంసీ ఆధీనంలో ఉన్న హిల్ కళ కోల్పోయి, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. ఈ తరుణంలో కలెక్టర్ లక్ష్మీశ చొరవతో గాంధీహిల్ ఫౌండేషన్ ఆధీనంలోకి వచ్చింది. ఈ ఏడాది మే 5న



బాధ్యతలు తీసుకున్న ఫౌండేషన్ అభివృద్ధి పనులను మొదలుపెట్టింది. ఇప్పటి వరకు రూ.1.30 కోట్లతో హిల్‌కు సరికొత్త హంగులు అద్దారు.

విజ్ఞాన, వినోదాల మేళవింపు

విజయవాడ రైల్వేస్టేషన్ వెస్ట్ బుకింగ్ కౌంటర్ రోడ్డు నుంచి ఈ హిల్ ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి బైక్, కారులో కొండపైకి చేరుకునేలా ఘాట్‌రోడ్డు ఉంది. భూమి, అంతరిక్షం, వాతావరణ మార్పుల విశేషాలను తెరపై మిగతా 8లో..

23న దుర్గమ్మకు గాజుల అలంకారం



ఇంద్రకీలాద్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఈనెల 23న గాజుల అలంకారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ఈవో శీనానాయక్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ప్రకటనలో కోరారు.



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

నిత్యాన్నదానానికి దాతల విరాళాలు

దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు గురువారం ఆలయ అధికారులకు విరాళాలు అందజేశారు. విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన టి.ఈశ్వర దుర్గా నాగేంద్ర కుటుంబసభ్యులు రూ.5,89,055లు విరాళంగా అందజేశారు. లంబాడీపేటకు చెందిన డి.రంగారావు తండ్రి డి.లక్ష్మయ్య జ్ఞాపకార్థం రూ.2,02,116లు విరాళంగా అధికారులకు అందజేశారు. గుంటూరు జిల్లా పండరీపురం నివాసి గుండ లక్ష్మీనారాయణ, ప్రభావతమ్మ దంపతులు విరాళంగా రూ.1,00,116లు అధికారులకు అందజేశారు. ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు, పీఎఫ్ఆర్‌డీఏ ఈడీ పేరి వెంకటేశ్వర్లు

ప్రతి పౌరుడికి పెన్షన్ అవకాశం

» ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు

విజయవాడ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులతో పాటు దేశంలోని ప్రతి ఒక్క పౌరుడికి పెన్షన్ అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అటల్ పెన్షన్ యోజన పథకం తీసుకువచ్చిందని స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని స్వప్న ఫంక్షన్ హాల్‌లో అటల్ పెన్షన్ యోజన పథకంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కరరావు, పేరి వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ, బ్యాంకు ఖాతాదారులకు అటల్ పెన్షన్ యోజన పథకం ప్రయోజనాలను వివరించారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి భారతీయుడు పథకంలో చేరి పెన్షన్ పొందవచ్చన్నారు. 60 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత రూ.1000 నుంచి రూ. 5 వేల వరకు పెన్షన్ పొందవచ్చని, అతి తక్కువ ప్రీమియం చెల్లింపులతో పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా 8.26 కోట్లమంది, ఆంధ్రప్రదేశ్‌లో 40 లక్షల మంది సభ్యులుగా నమోదు అయ్యారని చెప్పారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ఆర్‌డిఏ సీజీఎం పర్వేష్ కుమార్, ఆర్‌బిఐ జనరల్ మేనేజర్ ఆర్‌కె.మహన, నాబార్డ్ డీజీఎం ఎంఎం. బెహర, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు

వైసీపీ డైరెక్షన్‌లోనే అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం

» ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడం దళితుల మనోభావాలపై దాడి చేయడమేనని.. ఇది దళితులను అవమానించడమేనన్నారు. వైసీపీ నేతల డైరెక్షన్‌లోనే విగ్రహ ధ్వంసం జరిగిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకే వైసీపీ మూకలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గురువారం కృష్ణాజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ అధ్యక్షతన లక్ష్మీటాకీసు సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ ఎస్సీ సెల్ నేతలు పాలాభిషేకం, నిరసన వ్యక్తం చేశారు. తొలుత ర్యాలీ నిర్వహించగా.. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసి ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నించిన వైసీపీ నీచ సంస్కృతిని ప్రజాసంఘాలు, కుల సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. విగ్రహ ధ్వంసం కేసులో వైసీపీ నేతలు గోవిందయ్య, ఇతరులు పట్టుబడి జైలుకు వెళ్లినా జగన్ మౌనంగా ఉండటం దేనికి సంకేతమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, మోటమర్రి బాబాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, బత్తినదాసు, ఏఎంసి చైర్మన్లు కుంచె నాని, కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తొలిరోజు వాలీబాల్ పోటీల విజేతలు

కృష్ణా వర్సిటీలో సాంస్కృతిక క్రీడోత్సవాలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో రెండ్రోజుల పాటు జరిగే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు పోటీ పడ్డారు. పోటీలను మొదటిరోజు ఇండోర్ స్టేడియంలో లాంచనంగా ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకె సుందరకృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాంబాబు ప్రారంభించారు. క్రీడా మహోత్సవాలలో పురుషులు, మహిళలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. టేబుల్ టెన్నిస్‌లో 20 జట్లు, వాలీబాల్‌లో 4 జట్లు, చదరంగంలో 37మంది పాల్గొన్నారు. సాంస్కృతిక విభాగంలో సోలో, గ్రూప్ సాంగ్స్, డాన్సులతో విద్యార్థులు కదం తొక్కారు. క్రీడావిభాగం సమన్వయ కర్తగా పీడీ గోపీ, సాంస్కృతిక కార్యక్రమానికి సమన్వయకర్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ దుర్గాప్రసాద్ వ్యవహరించారు. శుక్రవారం రెండోరోజు సాయంత్రం ముగింపు వేడుకల్లో ఉపకులపతి ఆచార్య కె.రాంజీ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

సాంకేతికతతో ప్రమాదాలకు చెక్

» ఐఐటీ ఇంజనీర్లతో కలెక్టర్ బాలాజీ సమీక్ష

» 14న రహదారి భద్రతా సమావేశాలు



రహదారి భద్రతపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాంకేతిక పరిజ్ఞానంతో రహదారి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో రహదారి భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కువగా జాతీయ రహదారులపైనే ప్రజలు మృత్యువాత పడుతున్నారన్నారు. వాహనచోదకులు రహదారిపై వెళ్లేటప్పుడు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద గూగుల్ మ్యాప్‌లో అప్రమత్తం చేయడం ద్వారా చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. తొలుత చెన్నయ్ ఐఐటీ సీనియర్ ఇంజనీర్ రాగుల్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ప్రమాదాలు అధికంగా జరిగే 100 జిల్లాల్లో కృష్ణా 75వ స్థానంలో ఉందన్నారు. రహదారి ప్రమాదాలను సాంకేతిక పరిజ్ఞానంతో నివారించవచ్చన్నారు. ప్రమాదాల నివారణకు సంజయ్‌యాప్, ఫీల్డ్ పర్ఫెప్షన్ సర్వేయాప్, ట్రామాకేర్ ప్రిపేర్నెస్ లెవల్ యాప్‌లు ఉన్నట్టు తెలిపారు. వీటి నిర్వహణకు రహదారులు రవాణా హైవేల మంత్రిత్వశాఖ నిధులు సమకూరుస్తోందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 14న జరుగనున్న జిల్లా రహదారి భద్రత సమావేశాలకు చెన్నయ్ ఇంజనీర్లు సాంకేతిక సహకారాన్ని అందించాలని సూచించారు. సమావేశంలో చెన్నయ్‌కి చెందిన సీనియర్ ప్రాజెక్టు ఇంజనీర్లు నవీన్‌కుమార్, రాగుల్, ఐరాడ్ రోల్ అవుట్ మేనేజర్ కళ్యాణ్, రవాణా అధికారి శ్రీనివాస్, రహదారులు భవనాల శాఖ ఈఈ లోకేశ్వరరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ప్రోత్సహించాలి

మచిలీపట్నం : సాంకేతిక పరిజ్ఞానంతో ఆక్వా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆక్వా సాగుపై సంబంధిత అధికారులు, అభ్యుదయ రైతులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాంకేతిక పద్ధతుల ద్వారా ఆక్వా సాగు రైతులకు లాభదాయకమన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సాగుచేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద నందివాడ మండలం ఒక క్లస్టర్‌గా తీసుకుని ఆరు గ్రామాల పరిధిలో 300 మంది రైతులకు ఆక్వా సాగులో సాంకేతిక పరిజ్ఞానం జోడించే అంశంపై పూర్తి అవగాహన కలిగించాలన్నారు. ఆక్వా ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకులు కిరణ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విద్యుత్ 30శాతం ఆదా అవుతుందని, సాగుకూలి ఖర్చులు తగ్గిపోతాయని, సమయం వృధా కాకుండా ఉంటుందన్నారు. సమావేశంలో మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజు, అభ్యుదయ రైతు ఆక్వా ఎక్స్ఛేంజ్ ప్రాజెక్టు అధినేత కుమార్‌రాజు, మత్స్యశాఖ ఏడి సిహెచ్.రమేష్, ఎఫ్‌డీవో సెలేహ పాల్గొన్నారు.

తిరుమల ప్రత్యేక దర్శనం టికెట్లు ఇప్పిస్తానని

రూ. 12లక్షలు కొట్టేసిన వ్యక్తి అరెస్టు

» 14 రోజుల రిమాండ్

ఉయ్యూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిని మోసగించి రూ.12 లక్షలు తీసుకున్న కేసులో నిందితుడిని గురువారం అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచినట్టు ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. ఉయ్యూరులో ట్యాక్స్ కన్సల్‌టెంట్‌గా పనిచేస్తున్న ఓవ్యక్తి కొత్త ఇల్లు నిర్మించుకుంటున్న క్రమంలో కిటికీలు, తలుపులు, ఇత గృహనిర్మాణ సంబంధిత వస్తువులు సరఫరాచేస్తామని విజయదుర్గ యూపీవీసీ విండోస్ అండ్ డోర్స్ పేరుతో షాపు నడుపుతున్న గుడివాడ దామోదర్‌రావు అతడి కుమారుడు గుడివాడ యువకల్యాణ్ పరిచయం పెంచుకున్నారు. వారు కుటుంబసభ్యులతో తిరుమల వెంకన్న దర్శనానికి వెళుతున్నారని తెలుసుకున్న నిందితుడు గుడివాడ దామోదర్‌రావు ప్రత్యేక దర్శనం, వసతి ఏర్పాటుచేస్తామని నమ్మబలికి బాధితుల నుంచి పలుదఫాలుగా సుమారు రూ.12 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని కన్పించకుండా పోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు గుడివాడ దామోదర్‌రావును గురువారం పోలీసులు అరెస్టుచేసి కోర్టులో హాజరురచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. మరో నిందితుడిని త్వరలో అరెస్టుచేస్తామని, మోసగాళ్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

» వసతి గృహాల్లో సౌకర్యాలపై కలెక్టర్ బాలాజీ సమీక్ష

మచిలీపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే అంశంపై దృష్టి సారించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో గురువారం వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థినీ విదార్థుల సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 90 వసతిగృహాల్లో సురక్షిత తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. వాటర్‌ట్యాంకులను ప్రతినెలా శుభ్రం చేయాలన్నారు. వివరాలు నమోదు చేసేందుకు రిజిస్టర్‌ను పెట్టాలన్నారు. వసతిగృహాల్లో పారిశుధ్య చర్యలను పురపాలకసంఘాలు, పంచాయతీలు పర్యవేక్షించాలన్నారు. వైద్యులు, సిబ్బంది ప్రతినెలా 3న వసతిగృహాలకు వెళ్లి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి వివరాలను ప్రత్యేకయాప్‌లో నమోదు చేయాలన్నారు. వార్డెన్‌లకు నీరు, ఆహారంలో నాణ్యతను పరీక్షించేలా శిక్షణ ఇప్పించాలన్నారు. వంట గదులు, భోజనశాలలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతిగృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైతే వైద్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా తాగునీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ షాహిద్‌బాబు, బీసీ సంక్షేమశాఖ డీడీ రమేష్, గిరిజన సంక్షేమశాఖ డీడీ దూర్జటి, డీఎంఅండ్‌హెచ్‌వో ఎ.వెంకట్రావ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్పీ



మచిలీపట్నం క్రైమ్ అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా తయారీ కేంద్రాలు, షాపులకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసు వారికి సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలను బాణసంచా తయారి, విక్రయ కేంద్రాల వద్ద ఉంచరాదని అన్నారు. ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్పీ సూచించారు.



రేషన్ బియ్యం లోడుతో లారీ

పీడీఎస్ బియ్యం పట్టివేత

మచిలీపట్నం క్రైమ్ : పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను విజిలెన్స్ అధికారులు అడ్డుకున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో మచిలీపట్నం రూరల్ చిట్టిపాలెం గ్రామం వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీలో 605 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. విలువ సుమారు 10 లక్షల రూపాయిలు ఉంటుందని అంచనా వేశారు. బియ్యాన్ని మచిలీపట్నం నుంచి కాకినాడ తరలిస్తున్నట్టు సమాచారం. లారీని రూరల్ స్టేషన్‌కు తరలించి అధికారులు విచారణ చేస్తున్నారు.



ఆటోలో రేషన్ బియ్యం పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

గుడివాడలో 22 బస్తాలు స్వాధీనం

గుడివాడ : రేషన్ బియ్యం అక్రమ రవాణాపై వన్ టౌన్ పోలీసులు దాడులు నిర్వహించి 22 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక కార్మికనగర్‌లో పీడీఎస్ బియ్యం రవాణాపై సమాచారం మేరకు గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ బృందంతో దాడులు చేశారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని 22 బస్తాల బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



చోరీ జరిగిన ఇల్లు, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాల సేకరణ

చిలకలపూడిలో భారీ చోరీ

» రూ.22 లక్షల ఆభరణాల అపహరణ

» ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఘటన



మచిలీపట్నం క్రైమ్: చిలకలపూడి స్టేషన్ పరిధిలో ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో భారీ చోరీ జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం.. ఓ కో-ఆపరేటివ్ బ్యాంకులో పనిచేస్తున్న విష్ణు స్టార్ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్నాడు. తెల్లవారు జామున అందరూ నిద్రిస్తున్న సమయంలో దొంగలు వెనుకవైపు నుంచి ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 216 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఉదయం చోరీ విషయం గుర్తించిన విష్ణు, కుటుంబసభ్యులు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

రైల్వేస్టేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే స్టేషన్‌లోని ఆర్‌పిపిఎం గూడ్స్ ట్రైన్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు గురువారం కేసు నమోదైంది. గూడ్స్ రైలు దగ్గర ఉన్న విద్యుత్ టవర్‌ను తాకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న స్టేషన్ సూపరింటెండెంట్ కె.సురేష్ విజయవాడ రైల్వే పోలీసులకు సమాచారం తెలియపరిచారు. మృతదేహం వద్ద ఎటువంటి గుర్తింపు ఆధారాలు లేకపోవటంతో పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





కొండంత అందం

(7వ పేజీ తరువాయి)

చూపించే ప్లానిటోరియం ఘాట్‌రోడ్డు ప్రారంభంలోనే కనిపిస్తుంది. స్మారక చిహ్నం దిగువన పార్క్, ఆ పక్కనే హిల్ చుట్టూ తిరిగుతూ మధురానుభూతులను పంచే రైలు, పార్క్‌కు ఎదురుగా ఏర్పాటుచేసిన జంతర్ మంతర్ నమూనా ఆకట్టుకుంటాయి. కొండపైన స్మారక చిహ్నం వద్ద, దిగువన.. గాంధీజీ గుజరాత్, మహారాష్ట్ర, దక్షిణాఫ్రికాలో బస చేసిన శబర్మతి, సేవాగ్రమ్, ఫ్యూనిక్స్ ఆశ్రమాల నమూనాలను ఏర్పాటు చేశారు. అలాగే, ఆ ప్రాంతంలోనే గాంధీజీ జన్మించిన పోరు బందరులోని ఇంటి నమూనా తీర్చిదిద్దారు. అక్కడి నుంచే లిఫ్ట్ ఉంటుంది. కొండపైకి చేరుకోగానే, అద్భుతమైన వ్యూ పాయింట్ కనిపిస్తుంది. ఇక్కడి నుంచి నగర సోయగాలను ఆస్వాదించవచ్చు. తూర్పుదిశలో రైల్వేస్టేషన్ పూర్తిభాగం, గుణదల కొండ, అంబేడ్కర్ స్మృతివనం, యనమలకుదురు శివాలయం కనిపిస్తాయి. వీటిని చూస్తూనే దక్షణం దిక్కుకు తిరిగితే కృష్ణానది సోయగాలు, తాడేపల్లి వరకు నగరం మొత్తం, పడమర దిక్కుకు తిరిగితే ఇంద్రకీలాద్రి, వన్‌టౌన్, కాళేశ్వరరావు మార్కెట్ కనువిందు చేస్తాయి. ఉత్తరం దిక్కుకు తిరగగా, జక్కంపూడి, నున్న ప్రాంతాల వరకు చూడొచ్చు.

మహాత్ముడి స్మారకంగా..

కొండ పైభాగాన మహాత్మాగాంధీ కాంస్య విగ్రహంతో పాటు స్మారక చిహ్నం ఉంటుంది. ఈ ప్రదేశానికి చేరుకునే దారిలోనే అరుదైన మొక్కలు ఆహ్లాదంగా పలకరిస్తాయి. చిహ్నంపై చెరగని మహాత్ముడి బోధనలు ముద్రించారు. సూర్యగ్రమనం ద్వారా సమయం తెలుసుకునేలా ఏర్పాటుచేసిన గడియారం పూర్వీకుల మేధోసంపత్తికి నిదర్శనం. సరికొత్తగా ముస్తాబైన గాంధీకొండ రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. మంగళవారం సెలవు. ఎంట్రీ టికెట్ ఒకరికి రూ.10 చెల్లించాలి.

దక్షిణాఫ్రికాలోనే జనార్దన్!

(7వ పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. జనార్దనరావు ఎప్పుడు వస్తాడా అని ఎక్సైజ్ అధికారులు ఎదురు చూస్తున్నారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి మొత్తం రెండు కేసులు నమోదయ్యాయి. ఒక కేసు అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నమోదు కాగా మరో కేసు విజయవాడ భవానీపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. దక్షిణాఫ్రికాలో ఉన్న జనార్దనరావు ఇండియాకు రావడానికి టికెట్ బుక్ చేసుకున్నాడని అధికార వర్గాలు గుర్తించాయి. ఆయన దేశంలో ఏ విమానాశ్రయంలో అడుగుపెట్టినా వెంటనే సంకెళ్లు వేయడానికి ఎక్సైజ్ వర్గాలు సిద్ధంగా ఉన్నాయి. జనార్దనరావును అదుపులోకి తీసుకుంటే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

నేడు కాకినాడ ల్యాబ్‌కు నకిలీ నమూనాలు

ఇబ్రహీంపట్నంలోని నకిలీ మద్యం తయారీ యూనిట్, గోదాములో స్వాధీనం చేసుకున్న సరుకు నమూనాలను కాకినాడలోని ప్రయోగశాలకు శుక్రవారం తీసుకువెళ్లబోతున్నారు. మొత్తం 137 మద్యం సీసాల నుంచి నమూనాలు సేకరించారు. స్పిరిట్, చక్కర, ఇతర రసాయనాలకు సంబంధించిన నమూనాలను అధికారులు సేకరించిన విషయం తెలిసిందే. వాటిని ప్రయోగశాలకు పంపడానికి వారం రోజుల వరకు గడువు ఉంది. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసినందుకు ఆ నమూనాలను కాకినాడలో ఉన్న ఎక్సైజ్ శాఖ ప్రాంతీయ ప్రయోగశాలకు పంపాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతానికి నకిలీ మద్యంతో ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్, విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్‌లో వ్యాపారం చేశారు. ఈ రెండింటి విషయంలోను అధికారుల వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. అద్దేపల్లి జనార్దనరావును కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్నట్టు అధికారులు న్యాయస్థానానికి తెలియజేశారు.

ఇదేం డీపీఆర్!

(7వ పేజీ తరువాయి)

అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఎన్‌హెచ్ - 16 మార్గంలో నిడమానూరు ఫ్లై ఓవర్‌ను నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు డబుల్ డెక్కర్ విధానంలో నిర్మించటానికి కేంద్రానికి డీపీఆర్ చేసి పంపించటం జరిగింది. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్తు) దగ్గర ఈ అంశం పెండింగ్‌లో ఉంది. ఇక్కడ డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు అనుమతులు ఇస్తుందా లేదా అన్న దాని కంటే కూడా.. కేంద్ర ప్రభుత్వం మచిలీపట్నం పోర్టును దృష్టిలో పెట్టుకుని అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విజయవాడ - మచిలీపట్నం ఆరు వరసల విషయంలో మాత్రం డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు అనుమతులు ఇచ్చే అవకాశం ఉంది.

అవినీతి దందా!

(7వ పేజీ తరువాయి)

ఇంత, విద్యాశాఖ అధికారులకు ఇంత అని విడమరచి చెప్పి మరీ నగదు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. యాజమాన్యం సంగతి పక్కనపెట్టి ఒక్కో టీచర్ పోస్టుకు కనీసంగా రూ.10 లక్షలకు తగ్గకుండా నగదు సమర్పిస్తేనే అనుమతులు ఇస్తామని విద్యాశాఖ అధికారులు ఖరాఖండిగా చెప్పి వసూళ్లకు పాల్పడ్డారని డీఈవో కార్యాలయ అధికారులే చెప్పుకుంటున్నారు. టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణలోనూ నిబంధనలను తుంగలోతొక్కారనే ఆరోపణలు ఉన్నాయి. టీచర్ పోస్టులు దక్కించుకునేందుకు నగదు చెల్లించిన వారి పేరున హాల్ టికెట్లు ఇచ్చారు. పరీక్ష జరిగే సమయానికి గంట ముందే ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో పరీక్ష రాయించినట్లు విద్యాశాఖ కార్యాలయంలోని అధికారులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. పరీక్ష జరిగిన తర్వాత పేపర్‌లను అసలైన అభ్యర్థులు రాసినట్లుగా తారుమారు చేశారని, ఇది బహిరంగ రహస్యమేనని అధికారులు గుసగుసలాడుకుంటున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఎపిసోడ్ మొత్తం విద్యాశాఖ కీలక అధికారి సూచనలతోనే జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీలో విద్యాశాఖ అధికారులు ఇంతగా బరితెగించడంతో ఈ విషయం ఆనోటా, ఈనోటా బయటకు వచ్చింది. మచిలీపట్నం కలెక్టరేట్‌లో ఇద్దరు, ముగ్గురు అధికారులు కలిస్తే టీచర్ పోస్టుల భర్తీలో విద్యాశాఖ అధికారులు వ్యవహరించిన తీరుపై చర్చించుకుంటూ కనిపించడం గమనార్హం. తొలుత మూడు పోస్టులను భర్తీ చేసి, కొద్ది రోజుల తర్వాత మరో రెండు పోస్టులను భర్తీ చేశారని విద్యాశాఖ అధికారులు చెప్పుకుంటున్నారు.

సీబీఐసీ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ, ఆంధ్రప్రదేశ్ యూనిట్ 25 మందితో రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పడింది. గుంటూరు రింగ్ రోడ్‌లోని కస్టమ్స్, జీఎస్టీ అప్పీల్స్ కార్యాలయంలో గురువారం పెన్షనర్ల సంఘం రాష్ట్రస్థాయి ఎన్నిక, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి గుంటూరుకు చెందిన టి.వివేకానందను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా విజయవాడకు చెందిన గద్దె తిలక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.దేవరాజన్ (తిరుపతి), బి.రాజేశ్వరరావు(గుంటూరు), ఎ.సత్యనారాయణ (రాజమండ్రి), పర్వతనేని ప్రసాద్ (విజయవాడ) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శి పదవికి పీవీ సత్యనారాయణ (గుంటూరు), పి.భీమ్ ప్రసాద్ (ఏలూరు), కేవీ అప్పలాచార్యులు (కాకినాడ), పీవీపీ నరసింహం (వైజాగ్) ఎన్నికయ్యారు. కోశాధికారిగా పి.కోటేశ్వరరావు (గుంటూరు), సీజీహెచ్ఎస్ ఏపీ కో-ఆర్డినేటర్‌గా గుమ్మడి సీతారామయ్య చౌదరి (గుంటూరు), విజయవాడ కో-ఆర్డినేటర్‌గా పి.భాగ్యరావు (విజయవాడ), మహిళా రిప్రెజెంటేటివ్‌గా కె.సామ్రాజ్యం (గుంటూరు) పదవులు దక్కించుకున్నారు. సర్కిల్ సెక్రటరీలుగా గుంటూరుకు చెందిన ఎన్ఎస్ నగేష్‌బాబు, విజయవాడకు పి.భాగ్యరావు, ఏలూరుకు ఎస్‌కె హుస్సేన్, కాకినాడకు టి.వెంకట్రావు, విశాఖపట్నంకు చెందిన ఎం.వినోద్ కుమార్, నెల్లూరుకు చెందిన ఇక్రముల్లా షా, తిరుపతికి ఇనయతుల్లా ఎన్నికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షులుగా సెంట్రల్ ఎక్సైజ్ శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ సీపీ రావు, గౌరవ సలహాదారులుగా ఐఆర్ఎస్ క్యాడర్‌కు చెందిన విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్లు బి.సీతారామయ్య, పీవీ రమణమూర్తి, నర్రా వెంకటేశ్వర్లును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా జీఎస్టీ సూపరింటెండెంట్లు కేపీ సాగర్, ఎం.గిరిబాబు వ్యవహరించారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు పనిచేస్తుంది.

కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి

గుడివాడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : బాణసంచా దుకాణాల్లో పనిచేసే కార్మికులకు తప్పనిసరిగా దుకాణ యజమానులు బీమా సదుపాయం కల్పించాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆదేశించారు. గురువారం స్థానిక పెద్దకాలువ సెంటర్‌లోని పైడిసీతారామయ్య బాణాసంచా దుకాణాన్ని రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లైసెన్స్ కలిగిన బాణాసంచా దుకాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్, సిబ్బంది పాల్గొన్నారు.


మందుగుండు దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530


కృష్ణవేణిని సత్కరిస్తున్న ఎంపీడీవో విమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్

జమిదింటకుర్రు గ్రామ కార్యదర్శి కృష్ణవేణికి సత్కారం

పెదపారుపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రగతి పథంలో గ్రామాన్ని నడిపించిన జమిదింటకుర్రు గ్రామ కార్యదర్శి నక్కా కృష్ణవేణికి స్వచ్ఛాంధ్ర అవార్డు కృష్ణా జిల్లా స్థాయిలో రావటం అభినందనీయమని ఎంపీడీవో విమాదేవి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కార్యాలయంలో కృష్ణవేణిని ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, కార్యదర్శులు సాగరరాణి, డీసీహెచ్ శ్రీనివాస్, దయామణి ఘనంగా సన్మానించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పమిడిముక్కల : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంటాడ, గురజాడ, తాడంకి, చోరగూడి, అలి నవీపాలెం, పెనుముత్స, గోపాలకృష్ణాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 6 నుంచి 10 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఈఈ గోవిందరావు తెలిపారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏర్పాటుకు కృషి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో రైతాంగానికి ప్రయోజనం చేకూరేలా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, ప్రాజెక్టు నిర్మాణ అంచనాలను ఇప్పటికే రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లీలాకృష్ణకు పంపినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాలవారీగా కాలువలు, డ్రెయిన్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఎమ్మెల్యే వెనిగండ్లకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరులోగా అత్యవసర పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చేలా వడ్లమన్నాడు, కొమరవోలు గ్రామాల్లోని మేజర్ చానల్స్, బుడమేరులో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. కాలువలపై కొనసాగుతున్న అత్యవసర పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేసేలా అధికారులకు సూచనలు చేశామన్నారు. ముఖ్యంగా బలహీనంగా ఉన్నచోట్ల కాలువ గట్లను పటిష్ఠం చేయడం, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డ్రెయినేజీ డీఈఈ నాగేంద్రకుమార్, ఇరిగేషన్ డీఈఈ సూర్యభరత్, ఏఈలు అనీల్‌కుమార్, అరుణ్, లక్ష్మీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల


రవికుమార్‌ను సత్కరిస్తున్న టీచర్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు

మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డకు సత్కారం

గుడివాడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్‌లోని టీచర్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ నర్రా మాధవ్‌కుమార్ ఆధ్వర్యంలో గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన చాట్రగడ్డ రవికుమార్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నందివాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెరికె రవికుమార్, ఎన్‌జీవోస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, ఎస్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎం.వి.ఎస్.ఎన్ ప్రసాద్, పాల్గొన్నారు.

శిథిల వంతెనపై భయం .. భయం

నందివాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జనార్థనపురం నుంచి నందివాడ వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నిత్యం వందల కొద్ది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద నేహరల్లి కాలువపై వంతెన (బ్రిటీష్ కాలం నాటిది) పూర్తిగా ధ్వంసమై రెండు నెలలు క్రితం లారీ దిగబడి కూలిపోయింది. ఆర్‌అండ్‌బీ అధికారులు తమ దగ్గర డబ్బులు లేవని చేతులెత్తేయటంతో ఇరిగేషన్ అధికారులు ఆ వంతెన పడవేసి తూములు పెట్టి వాటిపై గ్రావెల్ పోసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా వంతెన ఏర్పాటు చేసి మమ అనిపించారు. కురుస్తున్న వర్షాలకు ఈ నూతనంగా ఏర్పాటు చేసిన వంతెనపై గ్రావెల్ కరిగిపోయి వంతెన అంచులో గోతులుగా ఏర్పడ్డాయి. దీంతో గురువారం గ్రావెల్ టిప్పర్ ఆ గోతుల్లోకి వెళ్లి ప్రక్కకు ఒరిగి దోసపాడు కాలువలోకి పడిపోయింది. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదని వాహనదారులు తెలిపారు.

ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ పవన్‌ను వివరణ కోరగా, నూతనంగా వంతెన నిర్మించటానికి నిధులు మంజూరయ్యాయి. వర్షాకాలం అవ్వటం వల్ల తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశాం. నవంబరులో నూతన వంతెన నిర్మిస్తాం. కాంట్రాక్టర్ కూడా సిద్ధంగా ఉన్నారన్నారు.


నెహరెల్లి కాలువ వంతెనపై బోల్తా పడ్డ టిప్పర్ లారీ

మందుగుండు సామగ్రి నిల్వ ఉంచిన గోదాము తనిఖీ

కూచిపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి - పెదపూడి సెంటర్‌లో బాణాసంచా సామగ్రి గోదాముల తనిఖీ కోసం మచిలీపట్నం నుంచి జిల్లా ఎస్పీ ఆదేశాలతో వచ్చిన ప్రత్యేక పోలీసు శాఖ బృందం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. పెదపూడి గ్రామపంచాయతీ పరిధిలో గల పెడసనగల్లు రోడ్డులోని ఓ గోదాములో మందుగుండు సామగ్రి నిల్వ చేశారన్న సమాచారం మేరకు వచ్చిన బృందానికి తాళాలు తెరిచేందుకు షాపు యజమాని కోసం గురువారం రాత్రి వరకు నిరీక్షించారు. ఆ బృందంతోపాటు కూచిపూడి ఎస్సై కె.విశ్వనాథ్, మొవ్వ తహసీల్దార్ ఆదేశాలతో పెదపూడి వీఆర్వో రాజేంద్ర ప్రసాద్ తదితరులు గోడౌన్ వద్దకు చేరుకున్నారు. గోడౌన్ యజమాని తాళాలు తీసేందుకు సమయానికి సహకరించని కారణంగా తీవ్ర జాప్యం జరిగింది. పోలీసు అధికారులుఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి 7 గంటలు దాటిన తర్వాత దుకాణదారుడు తాళాలు తెరవటంతో గోడౌన్‌లో నిల్వ ఉంచిన సామగ్రిని పరిశీలిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. లైసెన్స్ పొందకుండానే గోడౌన్లలో మందు గుండు సామగ్రి నిల్వ ఉంచటం చర్చనీయాంశంగా మారింది.


మందుగుండు నిల్వలు పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు

ఇకపై ఆన్‌లైన్‌లో ఇంటి పన్నులు చెల్లింపు

● పంచాయతీ కార్యదర్శి నరసింహారావు

గుడ్లవల్లేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణపంచాయతీ ఇంటిపన్నులను ఆన్‌లైన్ ద్వారా పంచాయతీకి జమ చేసే ప్రక్రియ గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీలో ప్రారంభించామని పంచాయతీ కార్యదర్శి నరసింహారావు తెలిపారు. ఇంటి పన్నును గతంలో నగదు చెల్లింపులే నిర్వహిస్తుండగా ఈ విధానం ద్వారా తమ తమ ఆన్‌లైన్ అక్కౌంట్‌ల ద్వారా చెల్లించవచ్చన్నారు. చెక్కులు, డీడీలు సైతం స్వీకరిస్తామని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యాలయం వద్దకు వస్తే ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులపై అవగాహనపరుస్తామన్నారు. పన్ను చెల్లించిన వారికి వెంటనే రసీదును అందజేస్తామని కార్యదర్శి నరసింహారావు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అధునిక అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామంలో పలువురికి వారి వాట్సాప్, ఫోన్ ఎస్ఎంఎస్‌ల ద్వారా డిమాండ్ నోటీసులను జారీ చేశామని, నోటీసులు జారీ అయిన వారు 15 రోజుల్లోగా ఆన్‌లైన్ ద్వారా పున్నులు చెల్లించాలని ఆయన తెలిపారు.


ఆన్‌లైన్‌లో ఇంటిపన్ను జమచేసి రసీదు అందుకొంటున్న నరేష్

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తోట్లవల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మనిషి బలంగా ఉండాలంటే ఒక్క పౌష్టికాహారం మాత్రమే తీసుకుంటే సరిపోదని, అందుకు మంచి మనస్సు ఉండాలని, దురాశలతో నిరాశ చెందినా మనిషి బలంగా ఎదగలేడని జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం సుపోషిత్ భారత్ సక్షం భారత్ మండలస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మహిళలకు పలు సూచనలు, సలహాలను అందించారు. సర్పంచ్ పెనుముత్స రాధిక పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి అంగన్వాడీ కార్యకర్తలు తయారు చేసుకుని వచ్చిన పౌష్టికాహారాలను సభికులకు రుచి చూపించి, అవగాహన కల్పించారు. పౌష్టికాహార స్టాళ్లను ప్రదర్శించారు. ఎంపీడీవో రవికాంత్, ఎంఈవో జి వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ డాక్టర్ సయ్యద్ అమీర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, నాగ మల్లేశ్వరి, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పోషకాహారాలతో అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు


ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆటల పోటీలకు విద్యార్థుల ఎంపిక

నందివాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ఆటల పోటీల్లో భాగంగా ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన మండల స్థాయి అండర్ -14, 17 బాలబాలికల ఆటల పోటీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్ (పోలుకొండ) విద్యార్థులు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్‌లో ఏడుగురు విద్యార్థులు, బాలికల విభాగంలో వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్‌లో ఏడుగురు విద్యార్థులు డివిజన్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు మహేష్ తెలిపారు.

ఆర్థిక సాయం

గుడివాడ : స్థానిక ఆటోనగర్‌లో డ్రిల్లింగ్ వర్కర్‌గా పనిచేస్తున్న స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన దారివేముల వంశీ ఇటీవల ప్రమాదవశాత్తు మోచెయ్యి తొలగించడంతో గురువారం వంశీ ఇంట్లో ది గుడివాడ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్స్ యూనియన్ ఆటోనగర్ కమిటీ నాయకులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.లక్ష్మణరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్, నాయకులు ఆంజనేయులు, మొహిద్దీన్ బాషా, వీర్రాజు, రషీద్‌బేగ్, నాగరాజు, శ్యామ్‌కుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మూడురోజుల పాటు ధ్యాన మహాయజ్ఞం

గుడివాడ : రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన క్షేత్రంలో ఈనెల 10,11,12తేదీల్లో నిర్వహించే ధ్యాన మహాయజ్ఞం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన క్షేత్రం నిర్వాహకురాలు రాజకుమారి తెలిపారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్‌లోని కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గుడివాడ పరిసర ప్రాంతాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని నిర్వహించే సామూహిక యజ్ఞంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వాణి, డాక్టర్ మలిరెడ్డి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మిఠాయి దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

మిఠాయి దుకాణం ప్రారంభం

పామర్రు,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): పామర్రులో 1955లో నిర్మితమైన తాడిశెట్టి నాగేశ్వరరావు మిఠాయి దుకాణం ఇటీవల విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌కు గురై పూర్తిగా దగ్ధమైంది. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌కు చెందిన ఈ దుకాణాన్ని ప్రత్యేకంగా ఆధునీకరణ చేశారు. దానిని గురువారం ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా కూటమిశ్రేణులతో కలిసి లాంఛనంగా పునఃప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మండపాక శంకర్‌బాబు, తాడిశెట్టి మధు, నియోజకవర్గంలోని కూటమి నేతలు పాల్గొన్నారు. తొలుత వినియోదారులకు ఎమ్మెల్యే స్వీట్లు అమ్మకాలు చేశారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన వాగ్దానాలను గడిచిన 15నెలల నుంచి అన్ని సంక్షేమ పథకాలనందిస్తునే గ్రామాలఅభివృద్ధికి అవిశ్రాంతంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవలందిస్తున్న కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరాభిమానాలను ఒర్వలేక వైసీపీ నేతలు గ్రా మాల్లో చిచ్చు రేపుతున్నారని విమర్శించారు. ము ఖ్యంగా ఎస్సీ కాలనీల్లో జాతీయనేతలైన అంబెడ్కర్,జగ్జీవన్‌రామ్‌లాంటి వ్యక్తుల విగ్రహాలకు కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారని వాటిని ప్రజలు అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని ప్రజలకు అన్నారు. అంబెద్కర్ విగ్రహాల కూల్చివేతపట్ల వైఎస్ జగన్ దళితజాతికి తక్షణమే క్షమాపణ చేప్పాలని డిమాండ్‌చేశారు. దుర్మార్గపు రాజకీయలకు తెర లేపిన వారిని ఎస్సీకాలనిలో నిర్భందించాలని ప్రజల్ని కోరారు. కూటమి నేతలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

గుడ్లవల్లేరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాల నిరోధకంపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గుడ్లవల్లేరు ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలకు పాల్పడే వారు ఏవిధంగా మోసం చేస్తారు, వారి బారీ నుంచి ఎలా తప్పించుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. తల్లి తండ్రులకు సైబర్ నేరాల పట్ల ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలో తెలపాలని ఎస్సై సూచించారు. అలానే రహదారి భద్రత, మహిళా భద్రతలపై అవగాహన పరిచారు. డైల్ 112,1930 లను కూడా వివరించారు.

సంప్రదాయంగా అట్లతద్దె

కూచిపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అట్లతద్దె వేడులకను పలు గ్రామాల్లో గురువారం సాంప్రదాయబద్దంగా జరుపుకున్నారు. సందర్భంగా వేకువజామున ముత్తైదువులకు సాంప్రదాయ వంటకాలతో విందుభోజనం ఏర్పాటు చేస్తారు. ముత్తైదువులు, నోములు నోయించే మహిళలచేత గౌరీ దేవి నోములు నోయించి చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఉయ్యాలలూగి ఆటపాటలతో వేడుకలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామంలోని చెరువు, కాలువ సమీపంలో ప్రత్యేక పూజలు చేయిస్తారు. సాయంత్రం వేళ ఇచ్చినమ్మా వాయినం....పుచ్చుకుంటినమ్మా వాయినం అంటూ ముత్తైదువులకు అట్లు వాయినాలు అందిస్తారు.


కూచిపూడిలో..

గుడ్లవల్లేరు : స్థానిక సాయి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు అట్లతద్ది పండుగను విశేషంగా నిర్వహించారు. పాఠశాలలో గురువారం బాలికలతో చెమ్మచెక్క, ఒప్పులకుప్ప వంటి సంప్రదాయ ఆటలను యాజమాన్యం ఆడించి అట్లతద్ది విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

పామర్రు: తెలుగింటి ఆడపడుచులు అట్లతద్ది వేడుకలను మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు వేకువజామునే నిద్ర లేచి తలంటు స్నానాలు చేసి కొత్తబట్టలు ధరించారు. సాయంసంధ్యావేళలో గౌరిదేవివ్రతం చేసి ముత్తయిదువులకు ఇచ్చిందమ్మ వాయనం, పుచ్చుకుందమ్మ వాయనం.. అంటూ పుల్ల అట్లతో వాయినాలు అందించి ఆశీర్వచనాలు అందుకున్నారు. కొత్తగా పెళ్లయిన వధువులు ముత్తాయిదువు పెద్దామ్మల ఆశీర్వచనాలు స్వీకరించి, సమీపంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అట్లతద్ది వేడుకను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించి ప్రత్యేక ఉయ్యాలలో వనితలు, చిన్నారులు ఊగుతూ కేరింతల మధ్య సందడి చేశారు.


పామర్రులో..

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

● జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సునీత


జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ సునీత

పెదపారుపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ పేద, మధ్య తరగతి వర్గాలకు వరమని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సునీత అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెదపారుపూడి పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహించి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆమె మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాపారుల మోసాల బారిన పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ (వంశీ), మెడికల్ సూపర్‌వైజర్ శేఖర్, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివనాగమణి, అరుణ కుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పామర్రు: అనారోగ్య పేద ప్రజలు నిత్యం కొనుగోలు చేసే ఔషధాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం ద్వారా వారికి ఎంతో లాభం చేకూరుతుందని పామర్రు ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్ర ప్రధాన వైద్యాధికారి పి.సుదేష్‌బాబు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద జీఎస్టీ చాంపీయన్లు పులిగడ్డ రాజేశ్వరి, ఇందుపల్లి స్వాతి ఆధ్వర్యంలో రోగులకు గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌ల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడే ప్రజలు నిత్యం వినియోగించే మందులపై ఎంతమేర తగ్గుతుందో సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం ఏవో టి. మారుతిరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, ఏఎన్ఎం విజయభాను, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


మోటూరు పీహెచ్‌సీలో జీఎస్టీపై బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఆరోగ్య సిబ్బంది


సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న జీఎస్టీ చాంపీయన్లు స్వాతి,రాజేశ్వరి

గుడివాడ రూరల్: ప్రతి ఒక్కరికీ జీఎస్టీపై అవగాహన ఉండాలని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. గురువారం మోటూరు పీహెచ్‌సీలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బందికి జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రోగులు ఉన్నారు.

రవీంద్రను విమర్శించే హక్కు పేర్ని నానికి లేదు : టీడీపీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించే హక్కు మాజీ మంత్రి పేర్ని నానికి లేదని మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్తీ మద్యంపై దాడులు జరిపినది కూటమి ప్రభుత్వమేనని, అక్రమాలకు పాల్పడిన టీడీపీ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులపై ఆరోపణలు వచ్చినా ఎవరిపైనా చర్యలు తీసుకోలేదన్నారు. జే బ్రాండ్ మద్యంతో వేలాది ప్రజల ప్రాణాలు తీశారన్నారు. మద్యం బాబులే వైసీపీ నాయకులను ఓడించారన్నారు. టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, ఊకంటి రాంబాబు, బందారు నాని, అం జి, రామదాని వేణు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 530



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు సుబ్రహ్మణ్యం, లెనిన్, కృష్ణమూర్తి

బోధనేతర పనులు బహిష్కరిస్తాం : ఫ్యాప్టో

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అప్పగించే బోధనేతర పనులను బహిష్కరిస్తామని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ అంబటిపూడి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. డీఈవో, ఆర్డీవో కార్యాలయాల్లో అధికారులకు గురువారం వినతిపత్రాలు సమర్పించారు. ఫ్యాప్టో నాయకులుజి. నవీన్‌బాబు, లెనిన్, ఈ.వి.రామారావు, జయరాజ్, యు.వి.కృష్ణమూర్తి, శివరామకృష్ణ, సూరిబాబు, సిహెచ్.వి. సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన పథకం, హాజరు తప్ప మిగిలిన బోధనేతర పనులను బహిష్కరిస్తామన్నారు. బోధనేతర పనులను 10వ తేదీ నుంచి బహిష్కరిస్తామన్నారు. గూగుల్ షీట్లు నింపడం, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేయించడం సబబుకాదన్నారు.



బీసీ సంక్షేమ శాఖ కార్యాయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి

తూర్పుకాపులకు విదేశీ విద్యాపథకం అమలు చేయాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాపు కార్పొరేషన్ మాదిరిగా తూర్పుకాపు, గాజుల కాపు కార్పొరేషన్‌కు విదేశీ విద్యకు నిధులు మంజూరు చేయాలని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి కోరారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో గురువారం యశస్వి మాట్లాడారు. తూర్పు, గాజుల కాపులకు చెందిన విద్యార్థులకు ఐఏఎస్, గ్రూప్ 1, 2 పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణా కేంద్రాలను అన్ని జిల్లాల్లోనూ ప్రారం భించాలన్నారు. ప్రభుత్వం వివిధ పథకాల కింద 56 కార్పొరేషన్లను బీసీలకు ప్రారంభించిందన్నారు. బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. రాజేంద్రబాబు నిర్వహించిన ఈ సమావేశంలో తూర్పుకాపు సంఘం నాయకులు వాకమూడి శ్రీనివాస్, పిన్నింటి శ్రీనివాస్, కోన శ్రీహరి, సత్యనారాయణ, కునుకు రాజశేఖర్, శరశ్చంద్ర, వేల్పూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రామాలయం అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాతలు

కోదండ రామాలయానికి రూ.లక్ష విరాళం

అవనిగడ్డ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మూడో వార్డులోని పురాతన కోదండ రామాలయానికి కూనపరెడ్డి రాధాకృష్ణ దంపతులు లక్ష విరాళాన్ని అందజేశారు. పురాతనమైనఆలయం అభివృద్ధి చేసేందుకు రాధాకృష్ణ ఆయన భార్య పార్వతి, కుమారులు త్రినాథ్, కుందన్‌లతో కలసి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కె.శ్రీరామమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు అన్నపరెడ్డి కృష్ణ, అన్నపరెడ్డి శ్యాంసుందర్, అన్నపరెడ్డి ఆంజనేయులు, ఓంకారం నాగ భూషణం, అన్నపరెడ్డి వెంకటేశ్వరరావు, అంబుల వెంకటప్పయ్య తదితరులు పాల్గొని రాధాకృష్ణ కుటుంబాన్ని ఘనంగా సత్కరించారు.

లింగారెడ్డిపాలెం విద్యార్థినుల ప్రతిభ

కోడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన డిబేట్ పోటీల్లో లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రతిభకనబర్చారు. గాదె కావ్య, కడవకొల్లు అంజలి ద్వియతీ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు కోడూరు నాగరత్నకుమారి తెలిపారు. అక్టోబరు 11న జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి చేతులమీదుగా బహుమతులు అందుకుంటారన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి దుర్గ, ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు. రిటైర్డ్ ఐఏఎస్ మోహన కందా వారి వారధి ఫౌండేషన్ రాష్ట్రస్థాయిలో 16వ తేదీన నిర్వహించనున్న వ్యాసరచన పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థినులతో హెచ్‌ఎం నాగరత్నకుమారి



ఎస్‌వీఎల్‌లో అట్లతద్దె వేడుకల్లో మహిళలు



గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు



కోడూరులో గోరింటాకు చేతుల చూపుతున్న బాలికలు



చల్లపల్లి విజయక్రాంతిలో..

సంప్రదాయబద్ధంగా అట్లతద్దె

నాగాయలంక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అట్లతద్దె పండుగను సంప్రదాయబద్దంగా జరుపుకున్నారు. బాలికలు, మహిళలు, యువతులు చేతులకు, కాళ్లకు గోరింటాకును పెట్టుకున్నారు. గురువారం ఉదయాన్నే తలంటుకొని గౌరీదేవికి పూజలు చేశారు. అట్లను దొంతరలుగా పోసి ఆడపడుచులకు వాయినాలను అందించారు. చెట్ల కొమ్మలకు, బాదు గుంజలకు తాడులతో ఊయల కట్టి ఉత్సాహంగా ఊయలను ఊగారు. ప్రతి పల్లె కోలాహలంగా కన్పించింది. **అవనిగడ్డ :** ఎస్‌వీఎల్.కళాశాలలో అట్లతద్దె వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోడలు సాయి సుప్రియ, ఎంపీపీ తుంగల సుమతి, మాజీ ఎంపీపీ బండే నాగ వెంకట కనక దుర్గ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి పాల్గొనగా, ఉయ్యాల ఊగుతూ సందడి చేశారు. **అవనిగడ్డ రూరల్ :** అశ్వారావుపాలెంలో అట్లతద్దె సందర్భంగా వాయినాల పంపిణీ గురువారం రాత్రి నిర్వహించారు. గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేసిన మహిళలు అట్లు పోసి, పిండి వంటలు చేసి అట్లతద్దె వాయినాలను ఇచ్చుకున్నారు. రేపల్లె ఖ్యాతి, శ్రీవల్లి, మహిళలు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చల్లపల్లి విజయక్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలలో గురువారం అట్లతద్దె వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్ పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించగా, చల్లపల్లి జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ అతిథులుగా పాల్గొన్నారు. అట్లతద్ది పర్వదిన విశిష్టతను విద్యార్థినులకు తెలియచేశారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, ఆచరిస్తూ వేడుకలు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉయ్యాలలో అతిథులు, వి ద్యార్థినిలు ఊగుతూ సందడిచేశారు. అతిథులను ప్రిన్సిపాల్ శివరామప్రసాద్ ఘనంగా సత్కరించారు. **కోడూరు :** అట్లతద్దె వేడుకను ఘనంగా నిర్వహించారు. మహిళలు గౌరీదేవీకి ప్రత్యేక పూజలు చేసి, అట్ల నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వతంత్రపురంలో రోటి ఉయ్యాలలో వద్ద మహిళలు సందడి చేశారు.



ఇంటి నిర్మాణానికి అనుమతి మంజూరులో కార్పొరేషన్ జాప్యం

- కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌తో నిర్మాణం
- అడ్డగించిన అధికారులు, ఉద్రిక్తత

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిగా ఇంటి నిర్మాణానికి కార్పొరేషన్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు అనుమతులు మంజూరు చేయడం లేదంటూ గురువారం కొబ్బరితోట వాసి శ్రీపతి వెంకటాచలం ఆందోళనకు దిగారు. ఆరో డివిజన్ పరిధిలోని కొబ్బరితోటలో రేకుల షెడ్డు వేస్తుండగా అనుమతులు లేవని, నిర్మాణాన్ని నిలిపివేయాలని అధికారులు అడ్డుకున్నారు. బాధితులకు జనసేన నాయకులు, న్యాయవాదులు అండగా నిలిచారు. పక్కా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉన్నప్పటికీ భవన నిర్మాణానికి అనుమతులు ఎందుకు ఇవ్వ డం లేదో అర్థం కావడం లేదన్నారు. కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకుని గురువారం పనులు మొదలు పెట్టగా నిర్మాణాలు తొలగించేందుకు ఎక్స్‌కవేటర్ వచ్చింది. దీంతో అధికారులు, బాధితుడి మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు రంగంలోకి దిగి సర్ది చెప్పారు.

అవనిగడ్డలో మెగా జాబ్‌మేళా 15న

అవనిగడ్డ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డలో ఈ నెల 15వ తేదీన జరిగే మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళా వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఎస్‌వీఎల్.క్రాంతి జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. హెటిరో, జాయాలుక్కాస్, ఎస్ఎస్ ఇన్స్టుమెంట్స్, కోల్గేట్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్, శ్రీనివాస ట్రాక్టర్స్, మోహన్‌స్పిన్‌టెక్స్, అపోల్ ఫార్మసీ, పేటీఎం వంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మండలి వెంకట్రామ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్ జి.పృథ్వీజ, రాచూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి మధుకుమార్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి జాబ్ మేళా నిర్వహణ గురించి వివరించారు.



జాబ్‌మేళాపోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి

నాగాయలంక మండల సమావేశం నేడు

నాగాయలంక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీన ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో డి.వెంగళరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశంలో ఆయా శాఖల పనితీరును సమీక్షిస్తారన్నారు.

జడ్పీ సీఈవో కన్నమనాయుడు గూడూరులో పర్యటన

గూడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలో శానిటేషన్, సంపద తయారీ కేంద్ర, తడి, పొడి చెత్త సేకరణను గురువారం జడ్పీ సీఈవో కన్నమనాయుడు పరిశీలించారు. గ్రామ సర్పంచ్ లింగం సులోచనారాణి సాదరంగా ఆహ్వానించి మొక్కను అందజేశారు. మండల పరిషత్ ఏవో రామకృష్ణ, లింగం విజయ కుమార్, సెక్రటరీ టి.వి. భాస్కరరావు పాల్గొన్నారు.



కన్నమనాయుడుకు స్వాగతం పలుకుతున్న సర్పంచ్ సులోచనారాణి

బ్లాజమ్ బిజీ బడ్స్ ప్రీ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ప్రిన్సిపాల్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ క్వాలిటీ ఇన్ ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన పోటీల్లో బాజమ్ బిజీ బడ్స్ ప్రీ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నట్లు వ్యవస్థాపకురాలు కన్య మీడియాకు తెలిపారు. ఈనెల 5వ తేదీన ఢిల్లీలో జరిగిన సమావేశంలో అవార్డు అందుకున్నామన్నారు. చంటి పిల్లల మనస్తత్వానికి అనుగుణంగా సిలబస్‌ను రూపొందించి విద్య అందిస్తున్నామన్నారు.



జీఎస్టీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవిప్రసాద్



జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై పద్మావతి మహిళా కళాశాల విద్యార్థినుల ర్యాలీ

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు



గూడూరు హెల్త్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ఘంటసాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గించటంతో అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం మేలు చేసిందని శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై పంచాయతీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సర్పంచ్ రవిప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు శ్లాబుల్లో జీఎస్టీని తగ్గించటంతో ప్రజలపై భారం తగ్గిందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది, రోగులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. వైద్యాధికారిణి సాయి శరణ్య, జనసేన నాయకులు సుగ్గన పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్ :** జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలపై పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సూపర్ జీఎస్టీ సక్సెస్ అయిందని, దీని వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. దేశీయ ఉత్పత్తులు కొనుగోలు చేయడం వల్ల దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. 45వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్, తలారి రాంబాబు, ప్రిన్సిపాల్ డా. వి.వి. శైలజ, 45వ డివిజన్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గూడూరు :** గూడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం వైద్య ఆరోగ్య విభాగంలో సవరించిన జీఎస్టీ అంశాన్ని ప్రజలకు వివరించారు. డీసిహెచ్ఎస్ శేషుకుమార్, సూపరింటెండెంట్ నరేంద్ర, డీసీ చైర్మన్ పోతన స్వామి, సీహెచ్‌సీ డైరెక్టర్లు బేతాళ స్వామి, రాసంశెట్టి దుర్గారావు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



నాగాయలంక : జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై నాగాయలంక జడ్పీ పాఠశాల విద్యార్థులకు గురువారం పోటీలను నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. చైర్మన్ భోగాది విష్ణువర్ధన్, ఎస్ఐ కె.రాజేష్, హెచ్‌ఎం సత్యనారాయణ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమాలను మహిళా సంరక్షణ కార్యదర్శి భోగాది సరిత పర్యవేక్షించారు.

ఆకులమన్నాడులో పశువైద్య పరీక్షలు

గూడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీ చైర్మన్ పోతన స్వామి అన్నారు. ఆకులమన్నాడు గ్రామంలో గురువారం పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ మహమ్మద్ రఫీతో కలసి స్వామి ప్రారంభించారు. గూడూరు వెటర్నరీ డిస్పెన్సరీ క్లినిక్ పశువైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 50 గేదెలు, ఐదు ఆవులు, 65 గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.

గూడూరు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య సేవలు

గూడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సత్యసాయిబాబా వారి శతవర్ష జన్మదిన వేడుకలలో భాగంగా గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ పథకం కింద గర్భిణులకు నారాయణ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ ప్రసాద్, డాక్టర్ అరుణ కాత్యాయని గర్భిణులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిరంగప్రసాద్, డాక్టర్ నరేంద్ర, సేవాదళ్ సభ్యులు, పోతుకూచి నాగమణి, వడ్డి అశ్విని, ఎస్. నాగమణి, సరిత, వెంకటలక్ష్మి, రాఘవులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. రోగులు, వైద్య సిబ్బంది సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న సేవలను కొనియాడారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఎండీయూ వాహనం మాయం

మచిలీపట్నం క్రైమ్ అక్టోబరు 09 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఉన్న ఎండీయు వాహనం కనబడకుండా పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎండీయు ఆపరేటర్‌కు, డ్రైవర్‌కు తలెత్తిన వివాదంలో వాహనాన్ని స్టేషన్ పెట్టి పోలీలు తాళాలు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ బయట ఉన్న వాహనం రెండు రోజుల నుంచి కనబడడం లేదు. పోలీసులు సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. సదరు ఓనర్ దగ్గర రెండో తాళం ఉందని, అతనే తీసుకెళ్లే అవకాశం ఉందని సమాచారం. సీఐ నబీని వివరణ కోరగా వాహనాన్ని ఓనర్ తీసుకువెళ్లాడని, వాహనాన్ని నియంత్రించే అధికారం లేదన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి వెంకట్రామ్ సాయం

నాగాయలంక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పర్రచివరలో అగ్ని బాధిత ఒడుగు కోటేశ్వరమ్మను ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ గురువారం పరామర్శించారు. గ్రామీణ వికాస సమితి, నాగాయలంక ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేలు నగదు, వంట సామగ్రిని బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, భోగాది శివ విష్ణువర్ధన్, మంచాల తిరుపతి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.